www.visalaandhra.com

శుక్రవారం
29-03-2024

విజయవాడ ప్రచురణ

సంపుటి : 72, సంచిక : 277
పేజీలు : 8, వెల: రూ.5.00

Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

విశాలాంధ్ర

స్థాపితం : 1952

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

అక్షరాక్షరం అభ్యుదయం

78.3 కోట్ల మంది ఆకలి కేకలు

న్యూయార్క్: ప్రపంచవ్యాప్తంగా 78.3 కోట్ల మంది ఆకలి కోరల్లో చిక్కుకోగా, మరోవైపు ఆహారంలో 19 శాతం (2022లో) వృథా అయిందని ఐక్యరాజ్యసమితి తాజా నివేదిక పేర్కొన్నది. 2024 ఏడాది 'ఫుడ్ వేస్ట్ ఇండెక్స్' నివేదికను ఐరాస బుధవారం విడుదల చేసింది. 2030 నాటికి ఆహార వ్యర్థాలను సగానికి తగ్గించే లక్ష్యంతో ఆయాల దేశాల పురోగతిని ఐరాస ట్రాక్ చేస్తున్నది.

జగన్ బెయిల్ రద్దుపై 1న సుప్రీం విచారణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బెయిల్ రద్దు పిటిషన్‌పై సుప్రీంకోర్టులో ఏప్రిల్ 1వ తేదీన విచారణ జరగనుంది. జగన్ బెయిల్‌ను రద్దు చేయాలంటూ నరసాపురం ఎంపీ రఘురామకృష్ణ రాజు దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టనుంది. మరోవైపు జగన్ కేసుల విచారణను మరో రాష్ట్రానికి బదిలీ చేయాలంటూ వేరొక పిటిషన్‌ను సైతం రఘురామకృష్ణ రాజు అత్యున్నత న్యాయస్థానంలో దాఖలు చేశారు. అయితే ఈ పిటిషన్‌పై సోమవారం విచారణ జరుపుతామని జస్టిస్ సంజీవ్ ఖన్నా ధర్మాసనం తెలిపింది. దీంతో ఈ రెండు పిటిషన్లపై ఏప్రిల్ 1న విచారణ జరగనుంది.

అవినాశ్‌రెడ్డి బెయిల్ రద్దుపై 4న విచారణ

మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాశ్ రెడ్డికి ఇచ్చిన ముందస్తు బెయిల్ రద్దు చేయాలని దాఖలైన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో గురువారం విచారణ జరిగింది. కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరికి బెయిల్ రద్దు చేయాలని కోరే అధికారం లేదని అవినాశ్ తరపు న్యాయవాది వాదించారు. నెల రోజుల క్రితమే ఎన్ఐఏ కేసులో అప్రూవర్ వేసిన పిటిషన్‌ను డివిజన్ బెంచ్ అనుమతించిందని హైకోర్టు పేర్కొంది. అప్రూవర్‌కు అడిగే హక్కు ఉందని డివిజన్ బెంచ్ తీర్పులో స్పష్టంగా ఉందని తెలిపింది. ఈ మేరకు దస్తగిరి పిటిషన్‌ను తిరస్కరించలేమని ధర్మాసనం స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఏప్రిల్ 4వ తేదీకి వాయిదా వేసింది. వైఎస్ భాస్కర్‌రెడ్డి, ఉదయ్ కుమార్ రెడ్డి బెయిల్ పిటిషన్లపై సీబీఐ కౌంటర్ దాఖలు చేయగా, దీనిపై విచారణను ఏప్రిల్ 3కు వాయిదా వేసింది.

రాజకీయ ఒత్తిళ్లు...న్యాయ వ్యవస్థకు ముప్పు

- కోర్టులను అవమానిస్తుంటే మౌనంగా ఉండటం సరికాదు
- సీజేఐకి 600 మందికిపైగా న్యాయవాదుల లేఖ

న్యూఢిల్లీ: రాజకీయ ఒత్తిళ్లతో న్యాయ వ్యవస్థకు ముప్పు వాటిల్లుతోందని, అవినీతిపరులను కాపాడేందుకు కోర్టుల పరువు తీస్తున్న పరిస్థితులు ప్రమాదకరమని సీనియర్ న్యాయవాది హరీశ్ సాల్వే, బార్ కౌన్సిల్ ఛైర్‌పర్సన్ మన్నన్ కుమార్ మిశ్రా సహా 600 మందికిపైగా న్యాయవాదులు ఆందోళన వ్యక్తంచేశారు. ఈ మేరకు భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) డీవై చంద్రచూడ్‌కు లేఖ రాశారు. 'న్యాయవ్యవస్థకు ముప్పు-రాజకీయ-వృత్తిపరమైన ఒత్తిళ్ల నుంచి న్యాయ వ్యవస్థను కాపాడాలి' అనే శీర్షికతో ఆదిశ్ అగర్వాల, చేతన్ మిట్టల్, పింకీ ఆనంద్, హితేశ్ జైన్, ఉజ్వల పవార్, ఉదయ్ హోళ్ల, స్వరూపమ చతుర్వేది తదితరులు సీజేఐకి లేఖ రాశారు. ప్రతిపక్ష నాయకులపై అవినీతి ఆరోపణల వస్తున్న వేళ...హైప్రొఫైల్ కేసులు కోర్టుల విచారణలో ఉన్న సమయంలో ఈ లేఖ రాయడం చర్చనీయాంశమైంది. రాజకీయ, వ్యక్తిగత కారణాలతో కోర్టులను అమానించే, కించపరిచేందుకు జరిగే ప్రయత్నాలను ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతించరాదని న్యాయవాదులు కోరారు. ఇలాంటి పరిస్థితులకు

- మిగతా 2 లో

బెదిరించడమే కాంగ్రెస్ సంస్కృతి : మోదీ 2లో

కంటైనర్ కథ కంచికేనా?

- ఫర్నీచర్, వంటపాత్రలంటూ వైసీపీ భిన్న వాదనలు
- ప్రతిపక్షపార్టీల విమర్శలు పట్టించుకోని ప్రభుత్వం
- డిమాండ్ చేసినా వివరణ ఇవ్వని డీజీపీ
- ఈసీ జోక్యానికి విపక్షాల డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: విశాఖ డ్రగ్ కంటెయినర్ అంశాన్ని మరువకముందే తాడేపల్లి సీఎం క్యాంప్ ఆఫీస్‌లో మరో కంటైనర్ అనుమానాస్పద స్థితిలో కనిపించటం రాష్ట్రంలో పెద్ద వివాదాస్పద అంశమైంది. దీనిపై ప్రతిపక్ష పార్టీలన్నీ విచారణ కోరినప్పటికీ అధికారయంత్రాంగం కనీసం వివరణ ఇవ్వకపోవడం, వైసీపీ నేతలు భిన్న వ్యాఖ్యానాలు చేయడం అనేక అనుమానాలకు దారితీసింది. తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం పరిసరాల్లోకి వెళ్లాలంటే అనుమతి లేకుండా కాలు మోపడం కూడా అసాధ్యమన్న విషయం అందరికీ తెలిసిందే. అటువంటిది ఎన్నికల సమయంలో ఒక భారీ కంటైనర్ సీఎం బంగ్లా సమీపంలోకి వెళ్లి బైటకు రావడం, అది ఎందుకు వచ్చిందో పోలీసు ఉన్నతాధికారులు వివరణ ఇవ్వకుండా గోప్యత పాటించడం తీవ్ర చర్చనీయాంశమైంది. ప్రతిపక్ష పార్టీల నేతల వాహనాలను రోజూ తనిఖీ చేస్తున్న ఎన్నికల సంఘం సైతం దీనిపై నోరుమెదకపోవడం ఆశ్చర్యం కల్గిస్తోంది. రేణిగుంటలో కుక్కర్లు, మిక్సీలు, వాచీలు వంటి తాయిళాలతో ఉన్న అధికార పార్టీకి చెందిన డంప్ బయటపడిన 24 గంటల్లోనే సీఎం క్యాంపు కార్యాలయంలో ఈ కంటైనర్ వ్యవహారం బయటకు పొక్కడంతో కచ్చితంగా ఇది కరెన్సీ నోట్ల కట్టలకు సంబంధించిన కంటైనర్ అయి ఉంటుందని టీడీపీ నేతలు ఆరోపించారు. అయితే దీనిపై వైసీపీ నేతలు చేసిన భిన్న వ్యాఖ్యానాలు ప్రజల్లో ఉన్న అనుమానాలను మరింత పెంచాయి. సీఎం జగన్ బస్సు యాత్రకు సంబంధించి వంట పాత్రలు, ఇతర సామగ్రి కంటైనర్‌లో వచ్చినట్లు కొందరు వ్యాఖ్యానించగా, ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి వైవీ సుబ్బారెడ్డి ఆ కంటైనర్‌లో ఫర్నీచర్ వచ్చిందని మరో కథ వినిపించారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. కంటైనర్ క్యాంపు కార్యాలయానికి వచ్చి గంట తర్వాత వెళ్లాల్సిన మార్గంలో కాకుండా మరో రూటులో వెళ్లడం, రెండో చెక్ పోస్టు వద్ద ఉండే ఆటోమేటిక్ స్కానర్ నుంచి కాకుండా వేరే రూటులో కంటైనర్‌ను పంపడం, భద్రతా సిబ్బంది రికార్డుల్లో వాహన వివరాలు నమోదు చేయకపోవడం, పోలీస్ సిబ్బంది సైతం వాహనాన్ని తనిఖీ చేయకపోవడం అనుమానాలకు తావిస్తోందని ఆరోపించారు. దీనిపై డీజీపీ తక్షణమే వివరణ ఇవ్వాలని టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేశ్ డిమాండ్ చేశారు. తన కాన్వాయ్‌ను రోజూ తనిఖీ చేస్తున్న పోలీసులు ఈ కంటైనర్‌ను ఎందుకు వదిలేశారని ప్రశ్నించారు. అసలు ఈ కంటైనర్‌లో ఏముందో, సీఎం క్యాంపు కార్యాలయానికి ఎందుకు వచ్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు. టీడీపీ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ మాట్లాడుతూ జగన్ రెడ్డి ఐదేళ్ల పాటు ల్యాండ్, శాండ్, వైన్, మైన్, గంజాయి, డ్రగ్స్, ఎర్రచందనంలో బొక్కిన వేల కోట్ల సొమ్మంతా ఏపీ 16 జెడ్ 0363 నెంబరు వాహనంతో ఉన్న కంటెయినర్‌లో తాడేపల్లి సీఎం క్యాంపు ఆఫీసు నుంచి బయటకి వెళ్లిందని ఆరోపించారు. సీఎం

- మిగతా 2 లో

భారత సంతతి వైద్యురాలికి ఎలాన్ మస్క్ సాయం

2లో

సర్వీస్ ఉంటే స్వీపర్‌నైనా ప్రిన్సిపాల్ చేస్తారా?

2లో

- ఇలాంటి జీవో ఇచ్చిన అధికారిని జైలుకు పంపాలి
- విద్యాశాఖ ముఖ్యకార్యదర్శిపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం

ఏపీకి ముగ్గురు కేంద్ర ప్రత్యేక పరిశీలకులు

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్ కుమార్ మీనా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రానికి ముగ్గురు ప్రత్యేక పరిశీలకులను భారత ఎన్నికల సంఘం నియమించినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్ కుమార్ మీనా

- మిగతా 2 లో

ఎన్డీయే కూటమిలో అసమ్మతిరాగం

- బీజేపీ సీనియర్లు సోము వీర్రాజు, మాధవ్, విష్ణువర్ధన్‌రెడ్డికి మొండిచేయి
- విజయవాడ పశ్చిమలో పోతినకు భంగపాటు
- బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరిపై అసంతృప్తి
- అనపర్తిలో టీడీపీ నేత రామకృష్ణారెడ్డి అనుచరుల నిరసన
- ఆ పార్టీ జెండాలు, కరపత్రాల దహనం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో ఎన్డీయే భాగస్వామ్య పార్టీల్లో అసమ్మతిరాగం ఊపందుకుంది. టీడీపీ, జనసేన, బీజేపీ సీట్ల వ్యవహారం కొలిక్కి రావడంతో నిరసనలు భగ్గుమన్నాయి. పొత్తులో భాగంగా టికెట్లు దక్కని కూటమి అభ్యర్థులు ఆందోళనకు దిగుతున్నారు. అసంతృప్త నేతలంతా అధిష్ఠానంపై తిరుగుబాటు చేస్తున్నారు. రాష్ట్రంలో 175 అసెంబ్లీ స్థానాలకుగాను 144 సీట్లలో టీడీపీ, 21 సీట్లు జనసేన, బీజేపీ పది సీట్ల పొత్తుతో ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయించుకున్నాయి. ఇప్పటికే టీడీపీ, జనసేన సీట్లు విడుదల చేశాయి. తాజాగా బీజేపీ పది మంది జాబితా విడుదలతో ఆయా మూడు పార్టీల నేతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పది అసెంబ్లీ స్థానాల్లో ఆరు సీట్లను వలస వచ్చిన వారికే కేటాయించడంపై మండిపడుతున్నారు. బీజేపీ సీనియర్ నేత, ఆ పార్టీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, మాధవ్, విష్ణువర్ధన్‌రెడ్డి, పరిపూర్ణానంద స్వామి తదితరులకు చోటు దక్కలేదు. ఇతర పార్టీల నుంచి వలస వచ్చిన వారికే పెద్దపీట లభించింది. ఎంతోకాలం నుంచి బీజేపీకి సేవలందిస్తున్న నేతలకు టికెట్లు దక్కపోవడంతో రగిలిపోతున్నారు. బీజేపీలో చంద్రబాబుకు అనుకూలంగా ఉన్న వారికే పార్టీ టికెట్లు కేటాయించారన్న విమర్శలున్నాయి. దీనికి నిదర్శనంగా టీడీపీ నుంచి బీజేపీలోకి వచ్చిన సుజనాచౌదరికి, కామినేని శ్రీనివాస్‌కు టికెట్లు ఇవ్వడమేనని స్పష్టంచేస్తున్నారు. బద్వేల్ సీటుపైనా బీజేపీ నేతలు నిరసన వ్యక్తంచేస్తున్నారు. అటు ఎంపీల జాబితాలోనూ టీడీపీ ముద్ర ఉన్న

- మిగతా 2 లో

కేజ్రీవాల్‌కు ఊరట

- జైలు నుంచి పాలనతో మీకేంటి నష్టం
- పిటిషన్ కొట్టివేసిన ఢిల్లీ హైకోర్టు
- ఈడీ కస్టడీ 1 వరకు పొడిగింపు
- విచారణకు సిద్ధం: ఆప్ అధినేత

న్యూఢిల్లీ: మద్యం కుంభకోణానికి సంబంధించి మనీలాండరింగ్ కేసులో అరెస్టు అయిన ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఢిల్లీ హైకోర్టులో ఊరట లభించింది. జైలు నుంచి పరిపాలన సాగించేందుకు అభ్యంతరమేమున్నదని ఉన్నత న్యాయస్థానం ప్రశ్నించింది. న్యాయపరంగానూ ఎలాంటి అడ్డంకులు లేవని పేర్కొంటూ ఆ మేరకు దాఖలైన పిల్‌ను కొట్టివేసింది.

పాలనాపరమైన విషయాల్లో జోక్యం చేసుకోలేమని తెలిపింది. ఆచరణాత్మక ఇబ్బందులు ఉండవచ్చు కానీ సీఎంగా కొనసాగడానికి ఉన్న న్యాయపరమైన అడ్డంకి ఏమిటని పిటిషనర్‌ను ప్రశ్నించింది. న్యాయపరంగా ఎలాంటి ఆటంకాలు లేవని, పాలనాపరమైన నిర్ణయం జరగాల్సిందేనని తెలిపింది. మరోవైపు కేజ్రీవాల్‌కు ఈడీ కస్టడీని ఏప్రిల్ ఒకటో తేదీ వరకు పొడిగిస్తూ ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు ఆదేశాలు జారీచేసింది. ఏడు రోజుల కస్టడీ ముగియడంతో ప్రత్యేక జడ్జి కావేరి బవేజా ఎదుట కేజ్రీవాల్‌ను ఈడీ అధికారులు హాజరుపరిచారు. ఈడీ మరో ఏడు రోజుల కస్టడీ కోరగా... నాలుగు రోజులకు కోర్టు అనుమతిచ్చింది. ఏప్రిల్1న ఉదయం

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ఓవరాక్షన్ కాకపోతే మనకు వచ్చే ఒకటి రెండు సీట్లకు పదిస్థానాల్లో పోటీ అవసరమా!

సంక్షేమం అందించాం... ఆదరించండి

- పేదలకు రూ.2.70లక్షల కోట్ల పంపిణీ
- నంద్యాల సభలో సీఎం జగన్

ఎన్డీయే కూటమిని తరిమికొట్టేందుకు సిద్ధంగా ఉండాలంటూ సీఎం జగన్ వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు పిలుపునిచ్చారు. నంద్యాల పట్టణం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో గురువారం సాయంత్రం నిర్వహించిన 'మేమంతా సిద్ధం' బహిరంగ సభలో సీఎం జగన్ మాట్లాడుతూ బహిరంగ సభ చూస్తుంటే జన సముద్రాన్ని తలపిస్తోందని, సంక్షేమమే ధ్యేయంగా ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు పంచామన్నారు. ఐదేళ్లలో తాను చేసిన మంచిని చూసి ఆశీర్వదించాలని కోరారు.

3లో

తొలి సంతకం మెగా డీఎస్సీపైనే

- యువతకు 20లక్షల ఉద్యోగాలు
- రాప్తాడు సభలో చంద్రబాబు హామీ

2లో

భారత సంతతి వైద్యురాలికి ఎలాన్ మస్క్ సాయం

టొరంటో: కెనడాలో న్యాయపరంగా చిక్కుల్లో పడ్డ భారత సంతతి వైద్యురాలికి సహాయం అందించేందుకు ఎక్స్(ట్విట్టర్) వ్యవస్థాపకుడు, టెస్లా, స్పేస్ ఎక్స్ సంస్థల సీఈఓ ఎలాన్ మస్క్ ముందుకొచ్చారు. ఆమె చెల్లించాల్సిన 3 లక్షల డాలర్ల(రూ.2.50 కోట్లు) జరిమానా చెల్లించేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. భారత సంతతి వైద్యురాలు కుల్విందర్ కౌర్ గిల్ కెనడాలోని గ్రేటర్ టోరంటోలో గత పదేళ్లుగా చిన్నపిల్లల వైద్యురాలిగా పని చేస్తున్నారు. పిడియాట్రిక్స్, అలర్జీ, ఇమ్యూనాలజీలో పోస్టుగాడ్యుయేట్ ట్రెనింగ్ పూర్తిచేశారు. స్పెషలిస్టు డాక్టర్‌గా గుర్తింపు పొందారు. పేద ప్రజలకు, వలసదారులకు తన సేవలు అందిస్తుంటారు. 2020లో కెనడాలో కోవిడ్-19 ఉధృతంగా వ్యాప్తి చెందుతుండడంతో ప్రభుత్వం లాక్‌డౌన్ విధించింది. ఈ లాక్‌డౌన్‌ను కుల్విందర్ కౌర్ గిల్ వ్యతిరేకించారు. ప్రజలంతా తప్పనిసరిగా కరోనా వాక్సిన్ తీసుకోవాలన్న నిబంధనను కూడా తప్పుపట్టారు. లాక్‌డౌన్, వ్యాక్సినేషన్‌పై ప్రభుత్వ విధానాలను విమర్శిస్తూ ట్విట్టర్(ఇప్పుడు ఎక్స్)లో ధైర్యంగా పోస్టులు పెట్టారు. దీనిపై కెనడా మీడియా అభ్యంతరం వ్యక్తం చేసింది. చివరకు ఆమెపై కాలేజ్ ఆఫ్ ఫిజిషియన్స్, సర్జన్స్ ఆఫ్ అంటారియో విచారణ ప్రారంభించింది. క్రమశిక్షణా చర్యలకు సిఫార్సు చేసింది. దీనిపై కుల్విందర్ కౌర్ గిల్ న్యాయ పోరాటానికి దిగారు. కానీ, దురదృష్టం వెక్కిరించింది. 1.2 మిలియన్ డాలర్ల జరిమానా చెల్లించాలని 2022 అక్టోబర్‌లో కోర్టు ఆమెను ఆదేశించింది. అనేక విన్నపాల తర్వాత జరిమానాను 3 లక్షల డాలర్లుగా ఖరారు చేస్తూ గత నెలలో తీర్పు వెలువరించింది.

జరిమానా చెల్లించడానికి గడువు కూడా ఎక్కువగా లేదు. తన వద్ద అంత సొమ్ము లేకపోవడంతో కుల్విందర్ కౌర్ ప్రజల నుంచి విరాళాలు సేకరించడం మొదలుపెట్టింది. దాదాపు సగం నిధులు సేకరించింది. జరిమానా చెల్లించడానికి మరో నాలుగు రోజులు మాత్రమే గడువు ఉండగా... ఇంతలో ఈ విషయం తెలిసిన ఎలాన్ మస్క్ వెంటనే స్పందించారు. మొత్తం 3 లక్షల డాలర్ల జరిమానా తానే చెల్లిస్తానని ప్రకటించడం ద్వారా తన ఔదర్యాన్ని చాటుకున్నారు. ఆయనకు కుల్విందర్ కౌర్ గిల్ 'ఎక్స్'లో కృతజ్ఞతలు తెలియజేశారు.

నాటో దేశాలపై దాడిచేసే ఉద్దేశం లేదు: పుతిన్

మాస్కో: నాటో దేశాలపై రష్యా దాడి చేస్తుందనే పశ్చిమ దేశాల వాదనను ఆ దేశాధ్యక్షుడు పుతిన్ త్రోసిపుచ్చారు. కానీ, ఉక్రెయిన్ కు పశ్చిమ దేశాలు ఎఫ్-16 యుద్ధ విమానాలను అందజేస్తే మాత్రం వాటిని కూల్చేస్తామని స్పష్టం చేశారు. టోర్జోక్ ప్రాంతంలో ఉన్న రష్యా వైమానిక స్థావరాన్ని ఆయన సందర్శించారు. అక్కడి పైలట్లతో ముచ్చటించిన ఆయన కొద్దిసేపు సైనిక హెలీకాప్టర్‌లోని సిమ్యులేటర్‌లో కూర్చుని దాన్ని పరిశీలించారు. 1991లో సోవియట్ యూనియన్ విచ్చిన్నమైన తర్వాత అమెరికా నాయకత్వంలోని సైనిక కూటమి రష్యా వైపుగా విస్తరించింది కానీ నాటో దేశాలపై దూకుడుగా వ్యవహరించాలనే ఆలోచన తమకు లేదన్నారు. పోలండ్, చెక్ రిపబ్లిక్‌లపై రష్యా దాడి చేస్తుందన్న పశ్చిమ దేశాల వాదనలో నిజం లేదని పుతిన్ తేల్చి చెప్పారు. అమెరికాతో రష్యా సంబంధాలు ఇంతవరకూ దిగజారలేదన్నారు. ఒకవేళ ఉక్రెయిన్‌కు మద్దతుగా అమెరికా సైన్యాన్ని పంపినా, ఎఫ్-16లను ఇచ్చినా వాటిని కూల్చివేయడం ఖాయమన్నారు. పొరుగు దేశాల నుంచి రష్యాను లక్ష్యంగా చేసుకున్నా కూడా అమెరికా కోసం ఆ దేశాలు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని పుతిన్ హెచ్చరించారు.

నిజ్జర్ హత్యకేసులో ట్రుడో మళ్లీ పాతపాట

ఒట్టావా: ఖలిస్థానీ ఉగ్రవాది హర్‌దీప్‌సింగ్ నిజ్జర్ హత్య కేసు నేపథ్యంలో భారత ప్రభుత్వాన్ని ఉద్దేశిస్తూ కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో మారో మారు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కేసు దర్యాప్తులో భారత ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని కోరుకుంటున్నామన్న ఆయన... కేసులో ఢిల్లీ ప్రమేయాన్ని తేలిగ్గా తీసుకోలేమంటూ వ్యాఖ్యలు చేశారు. కెనడాకు చెందిన కేబుల్ పబ్లిక్ అఫైర్స్ మీడియా ఛానల్ నిర్వహించిన ఓ కార్యక్రమంలో ట్రూడో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిజ్జర్ హత్య కేసు దర్యాప్తులో భారత్ సహకారంపై అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ... 'కెనడా గడ్డపై మన పౌరుడి హత్య జరగడం అత్యంత తీవ్రమైన అంశం. ఇందులో భారత ప్రభుత్వ ఏజెంట్ల హస్తం ఉందని విశ్వసనీయ ఆరోపణలు వచ్చాయి. దీన్ని మేం తేలిగ్గా కొట్టిపారేయలేం. విదేశీ ప్రభుత్వాల చట్టవిరుద్ధమైన చర్యల నుంచి కెనడా పౌరులను కాపాడుకునే బాధ్యత మాపై ఉంది. అందుకే దీన్ని మేం తీవ్రంగా పరిగణిస్తున్నాం' అంటూ మళ్లీ పాత పాటే పాడారు. ఈ కేసులో కెనడా ప్రభుత్వం తగిన దర్యాప్తు చేస్తోందని, ఈ ఘటన ఎలా జరిగిందన్నది మరింత లోతుగా తెలుసుకునే విషయమై భారత ప్రభుత్వంతో కలిసి నిర్మాణాత్మకంగా పనిచేసేందుకు మేం ఎదురుచూస్తున్నామన్నారు. గతేదాది జూన్‌లో ఖలిస్థానీ ఉగ్రవాది నిజ్జర్ కెనడాలో హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ హత్యలో భారత ఏజెంట్ల పాత్ర ఉందంటూ ట్రూడో చేసిన ఆరోపణను భారత్ తీవ్రంగా ఖండించిన సంగతి విదితమే.

ఏపీకి ముగ్గురు కేంద్ర ప్రత్యేక పరిశీలకులు

(మొదటిపేజీ తరువాయి)

గురువారం తెలిపారు. 1987 బ్యాచ్‌కు చెందిన రిటైర్డు ఐఏఎస్ అధికారి రామ్‌మోహన్ మిశ్రాను స్పెషల్ జనరల్ అబ్జర్వరుగా, 1984 బ్యాచ్‌కు చెందిన రిటైర్డు ఐపీఎస్ అధికారి దీపక్ మిశ్రాను స్పెషల్ పోలీస్ అబ్జర్వర్‌గా, 1983 బ్యాక్‌కు చెందిన రిటైర్డు ఐఆర్ఎస్ అధికారి నీనా నిగమ్‌ను స్పెషల్ ఎన్నికల ఖర్చుల పరిశీలకునిగా నియమించినట్లు కేంద్ర ఎన్నికల సంఘం నుంచి సమాచారం అందినట్లు ఆయన చెప్పారు. రాష్ట్ర ప్రత్యేక పరిశీలకులు ముగ్గురూ వచ్చే వారం నుంచి రాష్ట్రంలో పర్యటిస్తారని, ఎన్నికల నిర్వహణకు చేస్తున్న ముందస్తు ఏర్పాట్లను పరిశీలిస్తారని పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణలో ఈసీ మార్గదర్శకాలను పటిష్ఠంగా అమలు పర్చే అంశం, రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలు, సమస్యాత్మకమైన ప్రాంతాలతో పాటు ఓటర్లను ఆకర్షించే, ప్రేరేపించే తాయిలాల నియంత్రణపై కూడా ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు చెప్పారు. జిల్లా ఎన్నికల అధికారులు, ఎస్పీలు, లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజన్సీలతో ఎన్నికల సంఘం నిర్వహించే సమావేశాల్లో వీరు పాల్గొని, విలువైన అనుభవాలను, సూచనలు, సలహాలను ఇస్తారని వివరించారు.

తొలి సంతకం మెగా డీఎస్సీపైనే

విశాలాంధ్రబ్యూరో-అనంతపురం: రాయలసీమ ద్రోహి జగన్‌ను ఇంటికి పంపడమే అందరి లక్ష్యం కావాలని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికలు రాష్ట్రానికి అత్యంత కీలకం అన్న చంద్రబాబు రాష్ట్రం భవిష్యత్ కోసమే బీజేపీ, జనసేనతో పొత్తు పెట్టుకున్నామని స్పష్టం చేశారు. వైఎస్సార్సీపీ పని అయిపోయిందని, ఇక 46 రోజులే మిగిలి ఉందని చెప్తూ రాష్ట్రాన్ని కాపాడే బాధ్యత మీదే అని పేర్కొన్నారు. గురువారం అనంతపురం జిల్లా రాప్తాడులో ప్రజాగళం సభలో ఆయన ప్రసంగించారు. టీడీపీ ప్రజాగళం సభలు సూపర్ డూపర్ హిట్ అవుతున్నాయని, జగన్ రెడ్డి 'మనమంతా సిద్ధం' సభలు ఫ్లాప్ షోలుగా మారాయన్నారు. డబ్బులు, మద్యం ఇచ్చినా జగన్ సభలకు వైసీపీ కార్యకర్తలు రావడం లేదన్నారు. వచ్చే ఎన్నికలు రాష్ట్రానికి అత్యంత కీలకమని, అందుకే మూడు పార్టీలు కలిసి బరిలోకి వచ్చామన్నారు. రాష్ట్రం కోసం, 5 కోట్ల మంది ప్రజల భవిష్యత్ కోసం టీడీపీ-జనసేన-బీజేపీ జట్టుకట్టాయని తెలిపారు. దెబ్బతిన్న రైతాంగం కోసం, మీ బిడ్డల ఉద్యోగాల కోసం, మహిళల రక్షణ కోసం, బడుగు బలహీన వర్గాల ఆత్మ గౌరవం కోసం పార్టీలతో కలిశామన్నారు. విధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్నిర్మించేందుకు తమకు మద్దతివ్వాలని చంద్రబాబు కోరారు. ప్రజా ప్రభుత్వం కోసం ప్రతిఒక్కరూ ముందుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. అక్రమ కేసులు, బెదిరింపులకు ఎవరూ భయపడవద్దని, జగన్‌ను ఇంటికి పంపడమే అందరి లక్ష్యం కావాలని చంద్రబాబు అన్నారు. విధ్వంసంతో రాష్ట్రాన్ని జగన్ లూటీ చేశారని, విద్యుత్ చార్జీలను అమాంతం పెంచేశారని, నిత్యావసర వస్తువుల ధరలు కూడా పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. అన్నింటి ధరలను పెంచుకుంటూ పోయిన జగన్? ప్రభుత్వాన్ని దించేయాలని, అసమర్థుడు, అవినీతిపరుడిని ఇంటికి పంపాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. జగన్ ప్రభుత్వం మద్యం ధరలు విపరీతంగా పెంచేసిందని, నాసిరకం మద్యంతో అనారోగ్యం పాలయ్యే పరిస్థితి నెలకొందని చంద్రబాబు తెలిపారు. నాసిరకం మద్యం తాగి ఎంతోమంది చనిపోయారని చెప్పారు. ఆఖరికి ఇసుకపైనా దోపిడీ చేశారని, భవన నిర్మాణ కార్మికులను వీధిన పడేశారని మండిపడ్డారు. స్థానిక అవసరాలకు ఇసుక దొరక్క భవన నిర్మాణ రంగం కుదేలైందని తెలిపారు. రాప్తాడులో ఇసుక దొరకదు కానీ, ఇక్కడి ఇసుక బెంగళూరులో దొరుకుతుందని ధ్వజమెత్తారు. జగన్ నిరుద్యోగులను నిలువునా ముంచేశారని, ఐదేళ్ల పాలనలో ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వకుండా మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ హయాంలో సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.68 వేల కోట్లు ఖర్చు పెట్టామని తెలిపారు. రాయలసీమకు రూ.12 వేల కోట్లు ఖర్చు పెడితే జగన్ ఐదేళ్లలో రూ.2 వేల కోట్లు కూడా ఖర్చు చేయలేదని విమర్శించారు. రాయలసీమకు రాజకీయ హింస తెచ్చిన జగన్... రాయలసీమ ద్రోహిగా చరిత్రలో మిగిలిపోతాడని చంద్రబాబు ధ్వజమెత్తారు. రాష్ట్రాన్ని వైసీపీ మాఫియా, సైకో రాజ్యంగా మార్చేశారని, పోలవరాన్ని గోదావరిలో ముంచేశారని విమర్శించారు. గోదావరి నీళ్లు రాయలసీమకు తీసుకొచ్చే బాధ్యత మాది అని ఈ సందర్భంగా చంద్రబాబు హామీ ఇచ్చారు. ప్రతి ఎకరాకు నీళ్లిచ్చే బాధ్యత కూడా తీసుకుంటామని స్పష్టం చేశారు. ఏడాదికి 4 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్న చంద్రబాబు ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగులకు రూ.3వేల నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చారు. తొలి సంతకం మెగా డీఎస్సీపైనే పెడతామని చెప్పారు. బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం, సబ్‌ప్లాన్ తీసుకొస్తామని వెల్లడించారు. సంపద సృష్టించడం తెలిసిన పార్టీ టీడీపీ అన్నారు. నీరొస్తే పరిశ్రమలు వస్తాయని, హార్టికల్చర్ పంటలు వస్తాయని, పంటలుపండితే రైతులకు ఆదాయం వచ్చి ఆస్తుల విలువ పెరుగుతుందన్నారు. ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని, దానిని సంక్షేమానికి ఖర్చు చేయవచ్చని చెప్పారు. ఆడబిడ్డలకు ఆడబిడ్డ నిధి కింద కుటుంబంలో ప్రతి ఒక్కరికి రూ.1,500 ఇస్తాం మని, అంటే ఒక కుటుంబంలో ఒక ఆడబిడ్డ ఉంటే ప్రతి నెలకు రూ.1,500 ఇస్తామని, ఇద్దరుంటే రూ.3,000, ముగ్గురుంటే రూ.4,500, నలుగురుంటే రూ.6,000లు అందరికి ఇచ్చే బాధ్యత తెలుగుదేశం పార్టీదే అన్నారు. ప్రతి ఇంట్లో ఎంత మంది విద్యార్థులంటే అందరికి అమ్మ ఒడి ఇస్తానని హామీనిచ్చి... ఇవ్వకుండా మోసం చేశాడన్నారు.

తల్లికి వందనం కింద ఒక్కో విద్యార్థికి రూ.15,000 చొప్పున కుటుంబంలో ఎంత మంది విద్యార్థులుంటే అందరికి ఇస్తామన్నారు. దీపం పథకం కింద ఏటా 3 సిలిండర్లు ఆడబిడ్డలకు ఇస్తామని, ఎర్రబస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. పరిశ్రమలు తీసుకువచ్చి ఏటా 4 లక్షల చొప్పున 5 ఏళ్లకు 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని తెలిపారు.

కంటైనర్ కథ కంచికేనా?

(మొదటిపేజీ తరువాయి)

కార్యాలయం నుంచి వెళ్లిన ఈ కంటైనర్ విజయవాడ బస్టాండ్ ఎన్టీఆర్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ ముందు ఆగింది. దానిలో నుంచి కరెన్సీ కట్టలతో నిండిన అట్టపెట్టెలు దింపి డిపో క్లర్క్ ఎర్నింగ్ అనే అధికారి చాంబర్‌లోకి తీసుకెళ్లారు. పోలీసులు, ఈసీ ఆ సీసీ ఫుటేజీలు పరిశీలించాలని, ఈ డబ్బంతా ఆర్టీసీ కార్గో వ్యవస్థను అడ్డం పెట్టుకుని రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలకు తరలించి ఎన్నికల్లో ఓట్లు కొనుగోలు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశారంటూ ఆరోపించారు. ఇంత తీవ్రమైన ఆరోపణలు వెల్లువెత్తినా అధికారయంత్రాంగం దీనిపై సమాధానం చెప్పడానికి వెనుకాడడాన్ని చూస్తుంటే కంటైనర్ కథ కంచికేనన్న విషయం స్పష్టమవుతోంది. ప్రతిపక్షాలు మాత్రం ఎన్నికలపై తీవ్ర ప్రభావం చూపే ఈ కంటెయినర్ వ్యవహారంపై ఈసీ తక్షణమే జోక్యం చేసుకోవాలని, విచారణ బాధ్యతను సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేస్తున్నారు.

కేజ్రీవాల్‌కు ఊరట

(మొదటిపేజీ తరువాయి)

11 గంటలకు కేజ్రీవాల్‌ను తిరిగి హాజరుపరచాలని ఆదేశించింది.

మా జోక్యం అక్కర్లేదు: హైకోర్టు

ఈడీ కస్టడీలో ఉన్న కేజ్రీవాల్‌ను ఢిల్లీ సీఎం పదవి నుంచి తొలగించాలని కోరుతూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్)ను ఢిల్లీ హైకోర్టులో ఆపద్ధర్మ ప్రధాన న్యాయమూర్తి మన్మోహన్ నేతృత్వంలోని జస్టిస్ మన్‌మీత్ పీఎస్ అరోరాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం కొట్టివేసింది. కేజ్రీవాల్‌ను సీఎం పదవి నుంచి తొలగించే విషయంలో కోర్టు జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని తేల్చిచెప్పింది. చట్టప్రకారం ఏ విధంగా ముందుకు వెళ్లాలన్నది ప్రభుత్వంలోని వివిధ శాఖలు నిర్ణయించుకోవాలని సూచించింది. జైలు నుంచి పరిపాలన సాగించడం సవాళ్లతో కూడుకొన్నదని, చాలా కష్టాలు ఎదుర్కొవాల్సి రావచ్చని అంగీకరిస్తాము గానీ... ఈ వ్యవహారంలో న్యాయపరమైన జోక్యం అవసరమేమీ కనిపించడం లేదని ధర్మాసనం స్పష్టంచేసింది. కేసు పూర్వాపరాల్లోకి వెళ్లడం లేదని తెలిపింది. రాష్ట్రపతి లేక గవర్నర్ పాలనను న్యాయస్థానం విధించదని, దీనిపై కార్యనిర్వాహక విభాగం నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని న్యాయమూర్తి స్పష్టంచేశారు. ముఖ్యమంత్రిగా ఆయన కొనసాగేందుకు ఆటంకాలు ఏమిటో చెప్పండి. రాజ్యాంగబద్ధ వైఫల్యం జరిగితే రాష్ట్రపతి లేక గవర్నర్ తగు చర్యలు తీసుకుంటారు. దానిపై మేము చర్యలు తీసుకోం. లెఫ్టినెంట్ గవర్నర్ దీనిని పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. రాష్ట్రపతి, మంత్రిమండలి చూసుకోవాలి. ఏం చేయాలో వారికి తెలుసు. రాజ్యాంగ నిబంధనల ప్రకారం ఎలా నడుచుకోవాలన్న అవగాహన వారికి ఉంటుంది. రాష్ట్రపతి పాలన లేక గవర్నర్ పాలనను హైకోర్టు విధించదు' అని జస్టిస్ మన్మోహన్ తెలిపారు.

మరో నాలుగు రోజులు కస్టడీలోనే

ఏప్రిల్ 1 వరకు కేజ్రీవాల్‌కు ఈడీ కస్టడిని పొడిగిస్తూ రౌస్ అవెన్యూ కోర్టు ప్రత్యేక జడ్జి కావేరి బవేజా ఆదేశాలిచ్చారు. మరో ఏడు రోజుల కస్టడీని ఈడీ కోరగా నాలుగు రోజులకు అనుమతిచ్చారు. కేజ్రీవాల్ విచారణ క్రమంలో ఐదు రోజులు వాంగ్మూలాలు తీసుకున్నామని, ఆయన సహకరించలేదని, సమాధానాలు దాటవేశారని, డిజిటల్ పరికరాల పాస్‌వర్డ్‌లు వెల్లడించలేదని రిమాండ్ రిపోర్టులో ఈడీ పేర్కొంది. మరో ముగ్గురి వాంగ్మూలాలు సైతం రికార్డు చేసినట్లు తెలిపింది. కేజ్రీవాల్‌ను గోవా ఆప్ నేతలతో కలిసి విచారించాలని, పంజాబ్ అధికారులకు సైతం సమన్లు పంపామని ఈడీ పేర్కొంది.

సీఎం అరెస్టుకు ఆ నాలుగు సాక్ష్యాలు చాలా: కేజ్రీవాల్

కస్టడీ ముగియడంతో కేజ్రీవాల్‌ను కోర్టులో హాజరుపర్చిన సమయంలో ఢిల్లీ సీఎం తన కేసును తానే వాదించుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులకు రెండు లక్ష్యాలు ఉన్నాయని, మొదటిది తనను ఈ కేసులో ఇరికించడం... రెండవది ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) లేకుండా చేయడమేనని కోర్టుకు తెలిపారు. ఆప్‌ను అణచివేసేందుకు ఈడీ యత్నిస్తోందని ఆరోపించారు. ఈ కేసులో తన పేరును నలుగురు సాక్షులు మాత్రమే ప్రస్తావించారని, ఒక సీఎంను అరెస్టు చేసేందుకు ఆ వాంగ్మూలాలు సరిపోతాయా అని ఈడీని ప్రశ్నించారు. ఆప్‌ను అవినీతి పార్టీగా చిత్రీకరించే ప్రయత్నం జరుగుతోందని మండిపడ్డారు. ఈడీ విచారణను ఎదుర్కొనేందుకు తాను సిద్ధమని కేజ్రీవాల్ స్పష్టంచేశారు. ఢిల్లీ మద్యం కేసులో రూ.100 కోట్ల అవినీతి జరిగినట్లు ఈడీ చెబుతోంది...మరి ఆ డబ్బు ఎక్కడ? ఈ కేసులో తనను అరెస్టు చేసేందుకు ఈడీ వద్ద సరైన సాక్ష్యాధారాలు ఉన్నాయా అని ప్రశ్నించారు. ఈడీ వద్ద సాక్ష్యాధారాలు లేనప్పుడు ఏ కోర్టు కూడా తనను దోషిగా పరిగణించలేదన్నారు. మద్యం కేసులో సీబీఐ దాఖలు చేసిన 31 వేల పేజీల చార్జిషీటులోగానీ, ఈడీ దాఖలు చేసిన 25 వేల పేజీల చార్జిషీటులోగానీ తన పేరు లేదన్న విషయాన్ని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. చార్జిషీట్లలో పేరే లేనప్పుడు తనను ఎలా అరెస్టు చేస్తారు... తప్పుడు కేసులో ఇరికించడమే ఈడీ లక్ష్యమా అంటూ కేజ్రీవాల్ నిలదీశారు. ఈ కేసులో అప్రూవర్‌గా మారిన మాగుంట రాఘవరెడ్డి ఇచ్చిన ఆరు వాంగ్మూలాల్లో తన పేరు లేదన్నారు. శరత్ చంద్రారెడ్డి అరెస్టైన తర్వాత రూ.55 కోట్ల ఎన్నికల బాండ్లు బీజేపీకి చేరాయని, ఆయనతో బలవంతంగా తన పేరు చెప్పించారని ఆరోపించారు. అంతకుముందు కోర్టుకు తరలించే సమయంలో విలేకరులతో మాట్లాడుతూ 'ఇది రాజకీయ కుట్ర. దీనికి ప్రజలే సమాధానం చెబుతారు' అని కేజ్రీవాల్ అన్నారు.

నా భర్తను వేధిస్తున్నారు: సునీత

కేజ్రీవాల్ ఆరోగ్యంపై ఆయన భార్య సునీతా కేజ్రీవాల్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈడీ అధికారులు ఆయనను వేధిస్తున్నారని ఆరోపించారు. కేజ్రీవాల్ విచారణ సందర్భంగా కోర్టుకు హాజరైన సునీత అక్కడ విలేకరులతో మాట్లాడుతూ 'నా భర్త ఆరోగ్యం బాగా లేదు. చక్కెరస్థాయిలో హెచ్చుతగ్గులు ఉన్నాయి. ఈడీ అధికారులు ఆయనను వేధిస్తున్నారు. ఈ దౌర్జన్యం ఎంతోకాలం సాగదు. ప్రజలే తగిన సమాధానం చెబుతారు' అని అన్నారు. ఆప్ మంత్రులు అతిశి, గోపాల్ రాయ్, సౌరభ్ భరద్వాజ్ కూడా కోర్టు వద్దకు వచ్చారు.

ఎన్డీయే కూటమిలో అసమ్మతిరాగం

(మొదటిపేజీ తరువాయి)

వారికి, చంద్రబాబుతో సన్నిహితంగా మెలిగిలిన వారికి ప్రాధాన్యతిచ్చారు. అనకాపల్లి ఎంపీ సీటును సీఎం రమేశ్‌కు, రాజంపేట సీటును కిరణ్‌కుమార్ రెడ్డి, రాజమండ్రి సీటును పురందేశ్వరికి కేటాయించిండంపై బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విశాఖ ఎంపీ సీటు బీజేపీ సీనియర్ నేత జీవీఎల్ ఆశించగా, దానిని పొత్తులో భాగంగా టీడీపీకి కేటాయించి, అక్కడ బాలకృష్ణ రెండో అల్లుడు భరత్‌ను నిలపడంపైనా అసంతృప్తితో ఉన్నారు. హిందూపురం బీజేపీ ఎంపీ సీటు దక్కకపోవడంతో స్వామి పరిపూర్ణానంద ఆగ్రహంతో ఉన్నారు. ఆయన స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగేందుకు సిద్ధమయ్యారు.

విజయవాడ పశ్చిమలో జనసేన సీటు గల్లంతు

పొత్తులో భాగంగా విజయవాడ పశ్చిమను బీజేపీకి కేటాయించడంతో జనసేన సీటు గల్లంతైంది. ఎంతో కాలంగా జనసేన కార్యక్రమాలను నిర్వహిస్తున్న బీసీ సామాజికవర్గానికి చెందిన పోతిన మహేశ్‌కు చుక్కెదురైంది. పశ్చిమ నియోజకవర్గాన్ని జనసేనకే కేటాయించాలంటూ పది రోజులుగా పోతిన, ఆయన అనుచరులు నిరసనకు దిగారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను పలుమార్లు పోతిన మహేశ్ కలిసి టికెట్టు విషయంపై నిలదీసినా స్పందన లేదు. బీజేపీ, టీడీపీ లాబీయింగ్‌లో భాగంగా విజయవాడ పశ్చిమకు కేటాయించాల్సిన జనసేన సీటు ఎగిరిపోయింది. దానిని బీజేపీకి కేటాయించి, ఆ సీటుకు సుజనా చౌదరికి ఇవ్వడంపై జనసేన నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంతో సుజనా చౌదరికి ఎలాంటి పరిచయం లేదు. ఆయన సామాజికవర్గానికి చెందిన ఓటర్లు కూడా పెద్దగా లేరు. కేవలం రాబోయే ఎన్నికల్లో డబ్బే కీలకంగా ఉండాలన్న లక్ష్యంతో సుజనా చౌదరిని బీజేపీ బరిలోకి దించినట్లు ప్రచారముంది. కూటమి తరపున విజయవాడ ఎంపీ టికెట్‌ను సుజనా చౌదరి ఆశించగా, అది దక్కకపోవడంతో విజయవాడ పశ్చిమ సీటు నుంచి సుజనా చౌదరి ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీకి దిగుతున్నారు. పోతిన మహేశ్‌కు టికెట్ దక్కకపోవడంపై ఆయన అనుచరులు ఆగ్రహంతో ఉన్నారు. జనసేన నుంచి టికెట్లు దక్కని వారంతా పార్టీకి రాజీనామా చేసి వైసీపీలో చేరారు. పిఠాపురం, పాయకారావుపేట, విజయవాడ ఈస్ట్, తాడేపల్లిగూడెం, విశాఖ తదితర నియోజకవర్గాలకు చెందిన కీలక నేతలు జనసేనకు రాజీనామా చేశారు. మరి కొందరు రెబల్‌గా పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు.

టీడీపీలో ఆగని అసంతృప్తులు

అనపర్తి అసెంబ్లీ సీటును పొత్తులో భాగంగా బీజేపీకి కేటాయించడంపై టీడీపీ నేతలు పెద్దఎత్తున నిరసనకు దిగారు. టీడీపీ అనపర్తి నేత, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి టికెట్ కేటాయించకపోవడంపై అనుచరులు ఆందోళనకు దిగారు. టీడీపీ కరపత్రాలు, ఫ్లెక్సీలు, జెండాలను తగులబెట్టారు. దీంతో అనపర్తిలోని రామవరంలో అనుచరులతో రామకృష్ణారెడ్డి సమావేశమయ్యారు. రామవరానికి పెద్దఎత్తున టీడీపీ నేతలు చేరుకుని టీడీపీ జెండాలు, ఎన్నికల సామాగ్రిని దహనం చేశారు. తనకు టికెట్ ఇవ్వకపోడంపై రామకృష్ణారెడ్డి ఆగ్రహంగా ఉన్నారు. రాబోయే ఎన్నికల్లో రెబల్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు. ఒక్క అనపర్తే కాదు, చాలా నియోజకవర్గాల్లో పొత్తులో భాగంగా టీడీపీకి సీట్లు గల్లంతవ్వడంతో సీనియర్లు నడిరోడ్డునపడ్డారు. ఈ సీటును పొత్తుల్లో భాగంగా జనసేనకు కేటాయించడంతో సుగుణమ్మ అసంతృప్తికి గురయ్యారు. టీడీపీ అవనిగడ్డ నియోజకవర్గ నేత మండలి బుద్ధప్రసాద్, పెడనలో బూరగడ్డ వేదవ్యాస్, పిఠాపురంలో వర్మతోపాటు తెనాలిలో ఆలపాటి రాజా, తదితర నియోజకవర్గాలకు చెందిన టీడీపీ సీనియర్ నేతలకు సీట్లు లభించకపోవడంతో వారికి దిక్కుతోచడం లేదు. ఒకే నియోజకవర్గానికి ఇద్దరు టీడీపీ నేతల కారణంగా మైలవరంలో సీటు దక్కకపోవడంతో టీడీపీ సీనియర్ నేత దేవినేని ఉమా రాజకీయ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. మొత్తంమ్మీద ఎన్డీయే కూటమికి చెందిన టీడీపీ, జనసేన, బీజేపీ సీట్ల జాబితా విడుదలతో అసమ్మతులు పెరుగుతున్నాయి.

తేజస్ ఎంకే1ఏ తొలి ఫ్లయిట్ విజయవంతం

బెంగుళూరు: తేజస్ ఎంకే1ఏ సిరిస్‌లో భాగంగా తయారైన తొలి విమానం ఎల్‌ఏ 5033 విజయవంతంగా ఆకాశంలో విహరించింది. బెంగళూరులోని హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) నుంచి గురువారం చీఫ్ టెస్ట్ పైలెట్ (గ్రూపు కెప్టెన్ కేకే వేణుగోపాల్ (రిటైర్డ్) అధ్వర్యంలో ఈ విమానం 15 నిమిషాలు ఎగిరింది. తొలి ఫ్లయిట్ విజయవంతమైనట్లు ఏరోస్పేస్, రక్షణ కంపెనీ వర్గాలు ప్రకటించాయి. దేశీయ పరిజ్ఞానంతో నిర్మించిన తేలికపాటి యుద్ధ విమానం ఇది. తేజస్ ఎంకే1ఏలో అత్యాధునిక ఎలక్ట్రానిక్ రాడార్, వార్‌ఫేర్, కమ్యూనికేషన్ వ్యవస్థలతో పాటు యుద్ధ సామర్థ్యాన్ని పెంచే ఫీచర్స్ ఉన్నట్లు హెచ్ఏఎల్ వెల్లడించింది. మార్క్ 1ఏ ఫైటర్ విమానం పరీక్ష బెంగుళూరులో విజయవంతంగా ముగిసిందని, సుమారు 15 నిమిషాల పాటు గగనవీధిలో విహరించినట్లు హిందుస్తాన్ ఏరోనాటిక్స్ అధికారులు చెప్పారు.

'ఎయిరిండియా' కేసులో ప్రఫుల్ పటేల్‌కు ఊరట

న్యూఢిల్లీ: ఎన్సీపీ (అజిత్ పవార్) ముఖ్య నేత ప్రఫుల్ పటేల్‌కు 2017లో నమోదైన అవినీతి కేసులో ఊరట లభించింది. సీబీఐ ఆయనకు క్లీన్ చిట్ ఇచ్చింది. ఎయిరిండియాకు విమానాలను లీజుకు ఇవ్వడంలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అప్పటి పౌర విమానయాన శాఖ మంత్రి ప్రఫుల్ పటేల్‌తో పాటు ఆ శాఖ ముఖ్య అధికారులపై 2017, మేలో సీబీఐ కేసు నమోదు చేసింది. ఏడేళ్ల పాటు విచారించింది. ఈ కేసుతో పటేల్‌కు సంబంధం లేదని తేల్చింది. నిందితులు అందరికీ క్లీన్‌చిట్ ఇచ్చింది. సార్వత్రిక ఎన్నికల్లో రాజ్యసభకు పటేల్ పోటీ చేయబోతున్న క్రమంలో ఈ పరిణామం చర్చకు దారితీసింది. కాగా, ప్రఫుల్ పటేల్ అధికార దుర్వినియోగానికి పాల్పడి అప్పటి ప్రభుత్వ విమానయాన సంస్థ ఎయిరిండియాకు పెద్ద సంఖ్యలో విమానాలను లీజుకు ఇచ్చేందుకు పౌరవిమానశాఖ, ఎయిరిండియా, కొందరు ప్రైవేటు వ్యక్తులతో కలిసి కుట్ర పన్నారన్నట్లు 2017 మేలో నమోదైన ఎఫ్ఐఆర్ పేర్కొంది. ఓ పక్క ఎయిరిండియా కోసం విమానాల కొనుగోలు జరుగుతుండగానే కొన్నింటిని లీజుకు తీసుకోవడంపై ప్రశ్నలు ఉత్పన్నమయ్యాయి. దీనిపై విచారణ చేపట్టిన సీబీఐ... ముందస్తు రద్దు నిబంధనలు లేకపోవడం వల్ల నేషనల్ ఏవియేషన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెట్ (ఎన్ఏసీఐఎల్) లీజు విమానాలకు అద్దె చెల్లించాల్సి వస్తోందని తేల్చింది.

సర్వీస్ ఉంటే స్వీపర్‌నైనా ప్రిన్సిపాల్ చేస్తారా?

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఏపీ విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. జూనియర్ లెక్చరర్లకు పదోన్నతి కల్పిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ హైకోర్టులో ఐదుగురు వ్యాజ్యాలు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై హైకోర్టు గురువారం విచారణ చేపట్టింది. ఏపీ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల్లో నాన్ టీచింగ్ స్టాఫ్‌ను ప్రిన్సిపాళ్లుగా ఎలా నియమిస్తారని ప్రశ్నించింది. సిలబస్, పాఠ్యాంశాలపై లైబ్రేరియన్లు, ఫిజికల్ డైరెక్టర్లకు ఏమి అవగాహన ఉంటుందని నిలదీసింది. ఈ జీవో ఇచ్చిన విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిని జైలుకు పంపించాలని మందలించింది. సర్వీస్ ఉందని స్వీపర్‌ను కూడా ప్రిన్సిపాల్‌గా నియమిస్తారేమోనంటూ హైకోర్టు ఎద్దేవా చేసింది. అసమర్థులను విద్యాసంస్థలకు అధిపతులుగా నియమిస్తే వారి తలరాతలు ఎలా మారతాయని ధర్మాసనం ప్రశ్నించింది. ఇలాంటి ఉత్తర్వులు జారీ చేయడం ఆత్మహత్యా సదృశ్యమే అవుతుందని అభిప్రాయం వ్యక్తం చేసింది. ఈ చర్యలను అనుమతిస్తే విద్యా వ్యవస్థ విధ్వంసానికి గురవుతుందని మండిపడింది. జీవోపై వివరణ ఇచ్చేందుకు కోర్టు ముందు హాజరు కావాలని పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిని ఆదేశించింది. జూనియర్ కాలేజీల్లో 197 మంది జూనియర్ లెక్చరర్లకు ప్రిన్సిపాల్స్‌గా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ప్రొసీడింగ్స్ ఉత్తర్వులను ధర్మాసనం సస్పెండ్ చేసింది. ఈ విచారణను ఏప్రిల్ 1వ తేదీకి హైకోర్టు వాయిదా వేసింది.

స్కిల్ కేసులో అచ్చెన్నాయుడికి ఊరట

స్కిల్‌డెవలప్‌మెంట్ కేసులో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడుకి ఊరట లభించింది. ఆయన దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టులో గురువారం విచారణ జరగ్గా... అచ్చెన్నపై తొందరపాటు చర్యలు తీసుకోవద్దని సీఐడీని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. తదుపరి విచారణను ఏప్రిల్ 2కు వాయిదా వేసింది.

బెదిరించడమే కాంగ్రెస్ సంస్కృతి: మోదీ

న్యూఢిల్లీ: దేశంలో న్యాయవ్యవస్థ సమగ్రతను దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ 600 మందికి పైగా న్యాయవాదులు భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ డీవై చంద్రచూడ్‌కు లేఖ రాసిన విషయం తెలిసిందే. రాజకీయ నేతలకు సంబంధించిన కేసుల్లో కోర్టు తీర్పులను ప్రభావితం చేసేందుకు కొన్ని స్వార్థమూకలు ఒత్తిడి వ్యూహాలను అమలుచేస్తున్నాయని అందులో ప్రస్తావించారు. దీనిపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందిస్తూ.. ఇతరులను వేధించడం, వారిపై కన్నెర్ర చేయడం కాంగ్రెస్ సంస్కృతి అని విమర్శించారు. 'ఐదు దశాబ్దాల క్రితం వారే (కాంగ్రెస్) కేంద్రానికి కట్టుబడి ఉండే న్యాయవ్యవస్థ కోసం పిలుపునిచ్చారు. తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఇతరుల నుంచి నిబద్ధతను కోరుకుంటారు. కానీ.. దేశంపై మాత్రం ఎటువంటి నిబద్ధతను చాటుకోరు. 140 కోట్ల మంది భారతీయులు వారిని ఎందుకు దూరం పెడుతున్నారో ఆశ్చర్యపోనవసరం లేదు' అని ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా రాసుకొచ్చారు. 'రాజకీయ అజెండాతో స్వార్థ ప్రయోజనాలను ఆశించే కొన్ని గ్రూప్‌లు న్యాయవ్యవస్థపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు యత్నిస్తున్నాయి. కోర్టులపై ప్రజల్లో విశ్వాసాన్ని తగ్గించేందుకు కీలక తీర్పులపై తప్పుడు కథనాలు సృష్టిస్తున్నాయి. వ్యక్తిగత, రాజకీయ కారణాలతో కోర్టు ప్రతిష్ఠను దెబ్బతీసే ఇలాంటి ప్రయత్నాలను అనుమతించకూడదు. ఇలాంటి వాటిపై మౌనంగా ఉంటే.. హాని చేయాలనుకునేవారికి మరింత బలం ఇచ్చినట్లే. దీనిపై కఠిన చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టును కోరుతున్నాం' అని న్యాయవాదులు తమ లేఖలో కోరారు.

రాజకీయ ఒత్తిళ్లు...న్యాయ వ్యవస్థకు ముప్పు

(మొదటిపేజీ తరువాయి)

మౌనం పరిష్కారం కాబోదని హితవు పలికారు. అలా చేస్తే హాని తలపెట్టే వారికి మరింత బలాన్ని ఇచ్చినట్లు అవుతుందన్నారు. కష్టకాలంలో సీజేఐ నాయకత్వం కీలకమని నొక్కిచెప్పారు. న్యాయస్థానాల కోసం బలంగా నిలబడాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం సుప్రీంకోర్టు పూనుకోవాలని న్యాయవాదులు కోరారు. దేశంలో న్యాయవ్యవస్థ సమగ్రతను దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, రాజకీయ నేతలపై కేసుల్లో తీర్పులను ప్రభావితం చేసేందుకు 'స్వార్థ ప్రయోజాలు ఆశించే సంఘాలు' ఒత్తిడి తెస్తున్నాయని న్యాయవాదులు ఆరోపించారు. ఈ వ్యూహాలు కోర్టులకే కాకుండా ప్రజాస్వామ్య స్ఫూర్తికి ముప్పు వాటిల్లజేస్తున్నాయన్నారు.

'స్వార్థ ప్రయోజనాలు ఆశించే కొన్ని సంఘాలు తమ రాజకీయ అజెండాతో న్యాయవ్యవస్థపై ఒత్తిడి తెచ్చేందుకు యత్నిస్తున్నాయి. న్యాయ ప్రక్రియను ప్రభావితం చేసి, కోర్టు ప్రతిష్ఠను దిగజార్చాలని చూస్తున్నాయి. ఇందుకోసం అనేక మార్గాలు అనుసరిస్తున్నాయి. న్యాయ వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని తగ్గించేందుకుగాను కీలక తీర్పులపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయి. కొందరు న్యాయవాదులు పగలు నేతలను సమర్థిస్తారు... రాత్రి మీడియాతో కలిసి జడ్జిలను ప్రభావితం చేయాలని చూస్తారు. కేవలం రాజకీయ ప్రయోజనాల ఆపేక్షతో ఇలా చేయడం బాధాకరం. రాజకీయ నాయకులు కొందరిపై అవినీతి ఆరోపణలు చేయడం.., ఆ తర్వాత వారినే కోర్టుల్లో సమర్థించడం వింతగా ఉంది. కోర్టు నిర్ణయాలు అనుకూలంగా రాకపోతే బహిరంగ విమర్శలకు దిగుతుండటం ఆమోదయోగ్యం కాదు. సామాజిక మాధ్యమాల్లో అవాస్తవ ప్రచారం జరుగుతోంది. దీనితో జడ్జిలను, కోర్టు తీర్పులను ప్రభావితం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. వ్యక్తిగత, రాజకీయ కారణాలతో కోర్టు ప్రతిష్ఠను దెబ్బతీసే ఇలాంటి ప్రయత్నాలను అనుమతించరాదు. చట్టాలు లేని దేశాలతో మన న్యాయస్థానాలను పోల్చే స్థాయికి కొందరు దిగజారుతున్నారు. అన్యాయంగా వ్యవహరిస్తున్నట్లు కోర్టులను ఆరోపిస్తున్నారు. ఇవి విమర్శలు మాత్రమే కాదు...న్యాయ వ్యవస్థపై ప్రజలకున్న విశ్వాసంపై ప్రత్యక్ష దాడి. చట్టాలను నీరుగార్చే ప్రయత్నం. 'నా దారే రహదారి' అన్నట్లు కొందరు వ్యవహరిస్తున్నారు' అని లేఖ పేర్కొంది. కాగా, 2018-19లో 'హిట్ అండ్ రన్' కార్యకలాపాలు, తప్పుడు కథనాలను, 2019 ఎన్నికలప్పుడు రఫేల్ కేసును ప్రస్తావించింది. అవినీతి ఆరోపణలపై విచారణకు డిమాండ్ రాగా 2018 నవంబరులో దాఖలైన ఫిర్యాదులపై విచారణకు సుప్రీంకోర్టు నిరాకరించిందని గుర్తుచేసింది. రఫేల్ ఒప్పందంలో అనుమానాస్పదంగా ఏమీ లేదని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొన్నట్లు లేఖ గుర్తు చేసింది.

సంక్షేమం అందించాం... ఆదరించండి

పేదలకు రూ.2.70లక్షల కోట్ల పంపిణీ

నంద్యాల సభలో సీఎం జగన్

విశాలాంధ్ర-నంద్యాల: ఎన్డీఏ కూటమిని తరిమికొట్టేందుకు సిద్ధంగా ఉండాలంటూ సీఎం జగన్ వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు పిలుపునిచ్చారు. నంద్యాల పట్టణం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో గురువారం సాయంత్రం నిర్వహించిన 'మేమంతా సిద్ధం' బహిరంగ సభలో సీఎం జగన్ మాట్లాడుతూ బహిరంగ సభ చూస్తుంటే జన సముద్రాన్ని తలపిస్తోందని, సంక్షేమమే ధ్యేయంగా ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు పంచామన్నారు. ఐదేళ్లలో తాను చేసిన మంచిని చూసి ఆశీర్వదించాలని కోరారు. నంద్యాల నుండి ఏలూరు వరకు, కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు ప్రజలు తిరిగి వైసీపీని గెలిపించేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. జగన్‌ను ఓడించేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు దత్తపుత్రుడు పవన్ కల్యాణ్ కేంద్రంలోని బీజేపీ ఏకమై తనపై తోడేళ్ల మాదిరి దాడి చేస్తున్నాయన్నారు. తాను ఒక్కడినే వీళ్లందర్నీ ఎదుర్కొనేందుకు ప్రజలంతా తనకు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. పొత్తుల మారి, జిత్తులమారి, ఎత్తుల మారి పార్టీలు కుట్రలు చేస్తున్నాయని, ఈ కుట్రలు, కుతంత్రాలను ఎదుర్కొనేందుకు సిద్ధమా అంటూ పిలుపునిచ్చారు. 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ స్థానాలను సాధించాలన్నారు. ఐదేళ్లు ఇంటింటికి సంక్షేమ పథకాలు అందించామన్నారు. మన తలరాతలు మనమే రాసుకోవాలని ప్రతి ఒక్కరూ రాబోయే ఎన్నికల్లో ఓటు వేయాలని కోరారు. మీకు మీ కుటుంబానికి మంచి జరిగి ఉంటే ఆలోచించి ఓట్లు వేయండని పిలుపునిచ్చారు. 58 నెలల కాలంలో గ్రామాల్లో గ్రామ సచివాలయాలు, పట్టణాల్లో వార్డు సచివాలయాల తీసుకువచ్చామని, వలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే పెన్షన్ పంపించామని జగన్ తెలిపారు. వివక్ష లేని పాలన అందించామన్నారు. సంక్షేమ పథకాల ద్వారా రూ.2 లక్షల 70 వేల కోట్లను బటన్ నొక్కి అన్ని కుటుంబాల వారికి పంపిణీ చేశామని సీఎం జగన్ వివరించారు. అమ్మ ఒడి, ఆసరా, చేయూత, సున్నా వడ్డీ, విద్య దీవెన, వసతి దీవెన, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం, జగనన్న చేదోడు పథకాలు అమలు చేయడంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా 31 లక్షల ఇళ్ల పట్టాలు అందజేశామని, 25 లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. షాదీ తోఫా కళ్యాణమస్తు పథకం అందజేశామన్నారు. పది నిమిషాల్లో ఆపద జరిగితే ఆ మహిళ వద్దకు పోలీసు చేరుకునే విధంగా దిశ యాప్‌ను రూపొందించామన్నారు. నాడు-నేడుతో పాఠశాలల రూపురేఖలు మార్చామని, గోరుముద్ద, విద్యా కానుక, బైజుస్ కంటెంట్, ఆరో తరగతి నుండి డిజిటల్ బోధన, ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్ ఏర్పాటు చేశామన్నారు. నంద్యాలను జిల్లా కేంద్రంగా చేశామని... ఇక్కడే మెడికల్ కాలేజీ ఏర్పాటు చేశామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 17 మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు. చంద్రబాబు గతంలో ఇచ్చిన ఒక్కటైనా అమలు చేయాలదని విమర్శించారు. నంద్యాల జిల్లాలో ఎంపీ పోచాను, ఎమ్మెల్యే అభ్యర్థులైన శిల్పా రవి, శిల్పా చక్రపాణి రెడ్డి, కాటసాని రామిరెడ్డి, కాటసాని రాంభూపాల్ రెడ్డి, గంగుల నాని బుగ్గన రాజాలను ఆశీర్వదించాలని ఆయన వేదిక సభాముఖంగా పిలుపునిచ్చారు. ఈ బహిరంగ సభలో పెద్ద సంఖ్యలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏపీఎండీసీ అసిస్టెంట్ మేనేజర్‌ను తొలగించండి

కోడ్ ఉల్లంఘించి వైసీపీ తరపున ప్రచారం
ఎన్నికల ప్రధాన అధికారికి టీడీపీ నేత షరీఫ్ లేఖ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రజా సొమ్మును జీతంగా తీసుకుంటూ వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఏపీఎండీసీ అసిస్టెంట్ మేనేజర్ పి.హేమంత్ కుమార్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేశ్‌కుమార్ మీనాకు గురువారం టీడీపీ సీనియర్ నేత ఎంఏ షరీఫ్ లేఖ రాశారు. హేమంత్ కుమార్ రెడ్డి చిత్తూరు జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడుగా సైతం వ్యవహరిస్తున్నారని, ఈ నెల 23న తిరుపతిలో వైసీపీ నిర్వహించిన 'మేమంతా సిద్ధం' బ్రోచర్ విడుదల కార్యక్రమంలోను, 25వ తేదీన పూతలపట్టులో వైసీపీ యూత్ మీటింగ్‌లోను పాల్గొన్నారని వివరించారు. ప్రజా సొమ్మును జీతంగా తీసుకుంటూ వైసీపీ తరపున ఎన్నికల ప్రచారం చేస్తున్న హేమంత్ కుమార్‌రెడ్డిని వెంటనే ఆ పదవి నుంచి తొలగించాలని కోరారు. ఏపీ వక్ఫ్ బోర్డుకు చెందిన ఈఆర్‌ఓ ఎన్నికల కోడ్ అమలు చేయడంలో వైఫల్యం చెందారని ఎన్నికల ప్రధాన అధికారికి ఆయన మరో లేఖ రాశారు. డోన్‌లోని ఎద్గా మసీదు, రాష్ట్రంలోని ఇతర మసీదుల కేర్‌టేకర్ కమిటీ ఏర్పాటు ఎన్నికల కోడ్‌కు విరుద్ధమని తెలిపారు. మంగళగిరిలోని అంజుమన్ గవర్నింగ్ బాడీ వైసీపీకి ఎన్నికల ప్రచారం చేస్తున్నారని, గుంటూరు సిటీలోని వక్ఫ్ ఇన్‌స్టిట్యూషన్‌కు కేర్‌టేకర్ కమిటీ ఏర్పాటు చేయాలంటే గుంటూరు సిటీ వక్ఫ్ ఇన్‌స్పెక్టర్ ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో వక్ఫ్ బోర్డు ప్రధాన ఎగ్జిక్యూటివ్ అధికారి ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా వ్యవహరించవద్దని ఆదేశించాలని కోరారు. ప్రభుత్వంలోని ఓ ఉన్నతాధికారి రాష్ట్రంలోని జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తూ అధికారిక పత్రాలపై జగన్ బొమ్మ యథావిధిగా కొనసాగించాలని ఆదేశించారని, ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తున్న ఆయనపై కూడా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అమరావతి రైతుల పోరాటం చరిత్రాత్మకం

మాజీ సీజేఐ ఎన్వీ రమణ

విశాలాంధ్ర-విజయవాడ: అమరావతి ప్రాంత రైతుల ఉద్యమం దక్షిణ భారతదేశంలో అతిపెద్ద రైతు పోరాటమని, రాజధాని కోసం జరిగిన ఈ పోరాటం చరిత్రాత్మకం అని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. కృష్ణాజిల్లా వీరవల్లిలోని కామధేను మిల్క్ ప్రాజెక్ట్ ప్రాంగణంలో గురువారం కృష్ణా మిల్క్ యూనియన్ పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎన్వీ రమణ బోనస్ చెక్కులను రైతులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజధాని నిర్మాణానికి రైతులు గత టీడీపీ ప్రభుత్వానికి భూమి ఇచ్చారని తెలిపారు. రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతులు నేరం చేయలేదని... జగన్ ప్రభుత్వం వారిపై దమనకాండ సాగించడం దురదృష్టకరం అన్నారు. నేషనల్ లీగల్ సర్వీస్ అథారిటీ ద్వారా రైతులు కోర్టుకెళ్లవచ్చని సూచించారు. రాజకీయ పార్టీలను రైతులు నిలదీయాలన్నారు. న్యాయవ్యవస్థ రైతులను తక్కువగా చూస్తోందని మండిపడ్డారు. రైతుకు భూమికి ఉన్న సంబంధాన్ని అర్థంచేసుకోలేని వాళ్లు న్యాయవ్యవస్థలో ఉన్నారని చెప్పారు. రైతు తమ భూమిని కోల్పోతే కుటుంబాన్నే కోల్పోయినట్లు భావిస్తారని చెప్పారు. రైతు సంఘాలు చైతన్యవంతం కావాలని, రైతులకు న్యాయం జరగాలనేదే తన కోరిక అని చెప్పారు. కృష్ణా మిల్క్ యూనియన్ వందలకోట్ల ఆదాయం సంపాదిస్తూ చాలా అద్భుత విజయాలను సాధిస్తోందన్నారు. నాగరికత అభివృద్ధి చెందడానికి ముందు రాజులు రైతులను సముచితంగా గౌరవించారని తెలిపారు. నేడు రైతు వృత్తి అంటరానిదిగా మారిందనడంలో సందేహం లేదన్నారు. రైతుల కోసం అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేయట్లేదన్నారు. దేశంలో వ్యవసాయం పరిశ్రమగా గుర్తింపు పొందలేదన్నారు. చట్టప్రకారం రావాల్సిన రక్షణలేవీ రైతులకు దక్కడం లేదని వాపోయారు. చట్టసభల్లో రైతు ప్రతినిధులెవరూ సభ్యులుగా లేరని, రైతు నాయకులను రాజకీయ పార్టీలు గుర్తించడం లేదని ఆవేదన చెందారు. పారిశ్రామికవేత్తలు, ఉన్నత ఉద్యోగులు, ధనవంతులకే చట్టసభల్లో ప్రాతినిధ్యం లభిస్తోందని అన్నారు. దక్షిణాదిలో రైతు సంఘాల్లో ఐక్యత తక్కువని, అదే ఉత్తరాది రాష్ట్రాల్లో రైతు సంఘాల ఐక్యత ఎక్కువని అన్నారు. ఏడాదిపాటు రైతులు ఢిల్లీలో పోరాడి మూడు రైతు చట్టాలను అమలు కాకుండా ఆపగలిగారని గుర్తు చేశారు. అనంతరం ఎన్వీ రమణను కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, పాలకవర్గ సభ్యులు, రైతులు సన్మానించారు.

చిన్నాన్నంటే నాన్నతో సమానం

- అలాంటి వ్యక్తిని చంపితే సీఎంగా చేసిందేంటి?
- హంతకులను కాపాడుతూ చెల్లెలిపైనే ఆరోపణలా?
- జగన్‌పై సునీత ఆగ్రహం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: "చిన్నాన్న అంటే మీకు అర్థం తెలుసా... నాన్న తర్వాత నాన్న. అలాంటి వ్యక్తిని చంపితే సీఎంగా ఉండి కూడా ఐదేళ్ల నుంచి హత్య కుట్రను ఛేదించలేదు. పైగా చిన్నాన్న కుమార్తెపైనే నిందలు వేయడం న్యాయ మా... మీ చెల్లి కోర్టులు, పోలీసుల చుట్టూ తిరుగు తుంటే అన్నగా మీ బాధ్యత ఏంటి... బంధుత్వాలకు అర్థం తెలుసా? అంటూ సీఎం జగన్‌పై వివేకా కుమార్తె సునీత ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నాన్నను ఎవరు చంపారో దేవుడికి తెలుసు, జిల్లా ప్రజలకు తెలుసు అంటున్నారు. అవును మీరు నిజమే చెప్పారు. వివేకాను చంపిం చింది ఎవరో దేవుడికి, మీకు, జిల్లా ప్రజలకు తెలుసు. అందుకే నిందితులను అంత బాగా రక్షిస్తున్నారంటూ సీఎం జగన్ ప్రొద్దుటూరు సభలో చేసిన వ్యాఖ్యలపై సునీత తీవ్రంగా స్పందించారు. తెలంగాణ హైకోర్టు వద్ద గురువారం ఆమె మీడియాతో మాట్లాడారు. వై.ఎస్.వివేకానందరెడ్డి హత్య కేసుకు సంబంధించి హంతకుడే చెబు తున్నాడు. వైఎస్ భాస్కర్‌రెడ్డి, అవినాశ్‌రెడ్డే వివేకాను హత్య చేయించారని చెపుతున్నా... ఐదేళ్లు మీ ప్రభుత్వం ఉండి ఏం చేశారు... నిందితులను రక్షించేది మీరు కాదా... గతంలో సీబీఐ విచారణ కోరింది మీరే, ఆ తర్వాత పిటిషన్ ఉపసంహరించుకున్నదీ మీరే. ఎన్నికలు వస్తున్నాయని ఐదేళ్ల తర్వాత చిన్నాన్న గుర్తొచ్చారా... మీరు చేయాల్సిన పని సరిగా చేయనందుకే బయటకు రావాల్సి వచ్చింది. ఎవరు స్వార్థపరులు, ఎవరు పదవుల కోసం హత్య కేసును వాడుకుంటున్నారు. హంతకులకు ఓటు వేయమని మీరు అడుగుతున్నారు. సినిమాలో రౌడీలు ఉంటారు, విలన్ ఉంటాడు. కేవలం రౌడీలను పట్టుకుంటే సరిపోతుందా... విలన్‌ను కూడా పట్టుకోవాలి కదా. చిన్నాన్న చనిపోయి ఐదేళ్లు అవుతోంది. సానుభూతి పొంది ఎన్నికల్లో ఓట్ల కోసం పాకులాడుతున్నారు. తండ్రిని కోల్పోయి నేను న్యాయం కోసం పోరాడుతున్నా. పదవుల కోసమని నాపై ఆరోపణలు చేస్తున్నారు. న్యాయం కోసం, ధర్మం కోసం నేను పోరాడుతున్నా. సానుభూతి కోసమే ఎన్నికల వేళ చిన్నాన్నను జగన్ తెరపైకి తెస్తున్నారు. వైసీపీ పునాదులు వివేకా రక్తంలో మునిగి ఉన్నాయి. ప్రజలు వాస్తవాలు గ్రహించి హంతకులకు, వారిని కాపాడేవారికి ఓటు వేయవద్దని కోరుతున్నానంటూ సునీత విజ్ఞప్తి చేశారు.

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం

- సరిహద్దు చెక్ పోస్టుల్లో నిఘా కట్టుదిట్టం
- ప్రత్యామ్నాయ పంటల సాగుపై గిరిజనులకు ప్రోత్సాహం
- సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అక్రమ మద్యం, గంజాయి సాగు, ఇతర మత్తు పదార్థాల రవాణా, విక్రయదారులపై ఉక్కుపాదం మోపాలని ఎక్సైజ్, స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో, పోలీస్ అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. వెలగపూడి సచివాలయంలో ఆయా శాఖల అధికారులతో గురువారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. సీఎస్ మాట్లాడుతూ సరిహద్దు రాష్ట్రాల డీజీపీల సమన్వయంతో వీటితో సంబంధం ఉన్న కింగ్‌పిన్లను గుర్తించి వారిని పీడీ యాక్టు కింద అరెస్టు చేయాలని ఆదేశించారు. చెక్ పోస్టుల్లో నిఘాను మరింత పటిష్ఠం చేయాలని చెప్పారు. గ్రామాల్లోని ఇతర మార్గాలు, సోర్సులపై కూడా నిఘా ముమ్మరం చేసి దీనిలో భాగస్వాములైన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. గిరిజన ప్రాంతాల్లో గంజాయి సాగుచేసే గిరిజనులకు ఆపరేషన్ పరివర్తన కింద ఆ సాగుకు ప్రత్యామ్నాయంగా ఇతర పంటల సాగుకు ప్రోత్సహించాలని పోలీస్, ఎక్సైజ్, సెబ్ విభాగాల అధికారులను ఆదేశించారు. అక్రమ మద్యం, మాదకద్రవ్యాల రవాణా, వినియోగం నియంత్రణ చర్యలు కేవలం ఎన్నికల వరకే పరిమితం చేయకుండా పూర్తి స్థాయిలో నియంత్రించే విధంగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

రాష్ట్ర స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంటు బ్యూరో కమిషనర్ ఎం.రవిప్రకాశ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఆరు రాష్ట్రాలతో అంతర్ రాష్ట్ర సరిహద్దు కలిగి ఉందన్నారు. 90 శాతం ఒడిశా రాష్ట్రం మల్కాన్‌గిరి జిల్లా నుంచి, 10 శాతం కోరాపుట్ జిల్లాల నుంచి గంజాయి రాష్ట్రంలోకి రవాణా జరుగుతోందని వివరించారు. ఒడిశా డీజీపీ సమన్వయంతో గంజాయి రవాణా నియంత్రణకు తగు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. గంజాయి రవాణాకు సంబంధించి రాష్ట్రంలో 35 మంది కింగ్‌పిన్లను గుర్తించగా వారిలో 25 మందిని అరెస్టు చేయగా మిగతా వారు పరారీలో ఉన్నారని వివరించారు. సరిహద్దు రాష్ట్రాల పోలీసుల సహకారంతో వారిని పట్టుకునేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. నార్కోటిక్స్ బ్యూరో సహకారంతో గంజాయి ఇతర మత్తుపదార్థాల రవాణా నియంత్రణపై తగిన చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో వివిధ రకాల సీజర్స్‌పై వివరిస్తూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చాక రాష్ట్రంలో ఇప్పటి వరకు రూ.4కోట్ల 38లక్షల విలువైన అక్రమ మద్యం, డ్రగ్స్ ఇతర వస్తువులను స్వాధీనం చేసుకోగా ఈఏడాది ఇప్పటి వరకు రూ.57 కోట్ల 80 లక్షల విలువైన వివిధ మద్యం, డ్రగ్స్, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

ఎక్సైజ్ శాఖ కమిషనర్ వివేక్ యాదవ్ మాట్లాడుతూ మద్యం సరఫరాకు రాష్ట్రంలో 17 ప్రైమరీ డిస్టిలరీలు, 20 ఐఎంఎఫ్‌ఎల్, నాలుగు ఇతర డిస్టిలరీలు ఉన్నాయని, ప్రతి డిస్టిలరీకి ఒక సహాయ కమిషనర్ స్థాయి అధికారిని ఇన్‌ఛార్జిగా పెట్టామని వివరించారు. సీసీ కెమేరాలతో నిఘా ఏర్పాటు ఉంటుందని మద్యం రవాణా చేసే వాహనాలను జీపీఎస్ ద్వారా మానిటర్ చేయడం జరుగుతోందన్నారు. ఎక్సైజ్ శాఖ అదనపు కమిషనర్ దేవకుమార్, ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవరావు పాల్గొన్నారు. వర్చువల్‌గా ఎక్సైజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజిత్ భార్గవ, విశాఖపట్నం, విజయవాడ జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు మల్లికార్జున, ఢిల్లీరావు, రవి శంకర్ అయ్యన్నార్, కాంతి రాణా టాటా, ఏఎస్ఆర్, అనకాపల్లి జిల్లాల కలెక్టర్లు విజయ సునీత, రవి సుభాశ్, ఎస్పీలు తుహిన్ సిన్హా, మురళీ కృష్ణ హాజరయ్యారు.

తాగునీటి సరఫరాపై ...

రాష్ట్రంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మంచినీటి సరఫరా పరిస్థితులపై గురువారం వెలగపూడి రాష్ట్ర సచివాలయంలో జలవనరులు, పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ, పట్టణ మంచినీటి సరఫరా విభాగాల అధికారులతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి సమీక్షించారు. తాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్ర ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్. రావత్, జలవనరులు, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశి భూషణ్ కుమార్, ఆర్థికశాఖ కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ, సీడీఎంఏ ఎల్.కేశ్ బాలాజీ రావు, జల వనరుల శాఖ నారాయణ రెడ్డి, భూగర్భ జలవనరుల శాఖ డైరెక్టర్ జాన్ సత్యరాజ్ హాజరయ్యారు.

పోలీస్ బ్యాడ్మింటన్ చాంప్...
రజత పతక విజేతలకు డీజీపీ అభినందనలు

విశాలాంధ్ర-విజయవాడ: బ్యాడ్మింటన్‌లో ప్రతిభ చూపిన పోలీస్ అధికారులను డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి అభినందించారు. తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లోని గచ్చిబౌలి పుల్లెల గోపీచంద్ అకాడమీలో 16వ ఆల్ ఇండియా పోలీస్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ (2023-2024) పోటీలు ఈ నెల 17 నుంచి 23 వరకు జరిగాయి. ఆంధ్రప్రదేశ్ పోలీస్ జట్టు తరపున పాల్గొని రజిత పతకాలు సాధించిన ఎస్‌బీవీ సుధాకర్ (డీఎస్పీ సీఐడీ), పీవీ మారుతీరావు (డీఎస్పీ సీఓ) గురువారం డీజీపీ కలువగా ఆయన వీరిని అభినందించారు.18 రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత రాష్ట్రాలు, సెంట్రల్ పోలీస్ ఆర్గనైజేషన్‌కు చెందిన మొత్తం 499 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. ఏపీ డీఐజీ రాహుల్ దేవ్ శర్మ నేతృత్వంలోని క్రీడాకారుల బృందం పోటీల్లో పాల్గొంది. పతకాలు సాధించిన అధికారులు డీజీపీని ఆయన కార్యాలయంలో కలిసి పోటీల వివరాలను వెల్లడించారు. క్రీడల్లో పతకాలు సొంతం చేసుకున్న పోలీసు అధికారులకు డీజీపీ అభినందనలు తెలిపారు.

ప్యాంటీ కారుపై టీడీపీ తప్పుడు ప్రచారం: సజ్జల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: చంద్రబాబు అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలు నిలిచిపోతాయని, మళ్లీ జన్మభూమి కమిటీలు వస్తాయన్న విషయం ప్రజలకు తెలుసని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి వ్యాఖ్యానించారు. చంద్రబాబు సభలకు జనం రావడం లేదని, టీడీపీని ప్రజలు చెత్తబుట్టలో వేశారని చెప్పారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయం దగ్గర గురువారం సజ్జల విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబును ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. అన్ని అనుమతులు తీసుకున్న ప్యాంటీ కారుపై తప్పుడు ప్రచారం చేశారని మండిపడ్డారు. ప్రజల్లోకి వెళ్తే ఏం చెప్పాలో చంద్రబాబుకు తెలియడం లేదని, బీజేపీలో ఉన్న టీడీపీ నేతలకే టికెట్లు ఇచ్చారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు మళ్లీ మోసపూరిత హామీలతో వస్తున్నారన్నారు. గతంలో చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలు మర్చిపోలేదని గుర్తుచేశారు. చంద్రబాబు ఓ నకిలీ నోటు అని, ఆ విషయమూ ప్రజలకు తెలుసని పేర్కొన్నారు. నోటుపై ఎలాంటి ముద్ర ఉన్నప్పటికీ, నోటు నకిలీది అని తెలిశాక ప్రజలు అలాంటి నోటు కావాలనుకోరని తేల్చిచెప్పారు. అలాగే చంద్రబాబునూ ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు.

నేడు 'సంక్షోభంలో నవభారతం-ఆర్థిక రాజకీయ మూలాలు' సదస్సు

విశాలాంధ్ర-విజయవాడ: ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) ఆధ్వర్యంలో 'సంక్షోభవంలో నవభారతం-ఆర్థిక రాజకీయ మూలాలు' అనే అంశంపై శుక్రవారం సదస్సు నిర్వహించనున్నట్లు యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక గవర్నర్‌పేట బాలోత్సవ భవన్‌లో సాయంత్రం ఆరు గంటలకు జరిగే ఈ సదస్సులో ఐలు జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు సుంకర రాజేంద్రప్రసాద్ , ప్రముఖ రాజకీయ ఆర్థిక, సామాజిక విశ్లేషకుడు పరకాల ప్రభాకర్ ముఖ్యవక్తగా పాల్గొంటారని చెప్పారు. వక్తలుగా ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, ఐఏఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి చలసాని అజయ్‌కుమార్, ఏఐసీసీ సభ్యుడు నరహరిశెట్టి నరసింహారావు, ఐలు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లూరి మాధవరావు పాల్గొంటారని వివరించారు.

డీవైఈవో స్క్రీనింగ్ టెస్ట్ వాయిదా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్స్ (డీవైఈవో) పోస్టుల భర్తీకి ఏప్రిల్ 13న నిర్వహించన్ను స్క్రీనింగ్ టెస్ట్‌ను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) వాయిదా వేసింది. ఈ మేరకు ఏపీపీఎస్సీ సెక్రటరీ జే ప్రదీప్‌కుమార్ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఏపీపీఎస్సీ ఈ నిర్ణయం తీసుకుంది. తిరిగి పరీక్షలు నిర్వహించే తేదీని తర్వాత ఖరారు చేస్తారు. ఖాళీగా ఉన్న 38 డీవైఈవో పోస్టులను నేరుగా భర్తీ చేసేందుకు తొలి విడత స్క్రీనింగ్ టెస్ట్‌కు ఈ ఏడాది జనవరి తొమ్మిదో తేదీ నుంచి ఏపీపీఎస్సీ దరఖాస్తులను స్వీకరించింది. ఎన్నికల కారణంగా ఈ పరీక్ష వాయిదా వేయడంతో నిరుద్యోగులు నిరుత్సాహం వ్యక్తం చేస్తున్నారు.

నేడు ఎమ్మిగనూరులో 'మేమంతా సిద్ధం'

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎన్నికల ప్రచారంలో భాగంగా వైసీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహిస్తున్న 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర మూడో రోజైన శుక్రవారం కర్నూలు జిల్లా పెంచికలపాడులో ప్రారంభం కానుంది. ఈ మేరకు వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలశిల రఘురామ్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. యాత్రలో భాగంగా సీఎం జగన్ ఉదయం 9 గంటలకు పెంచికలపాడు నుంచి రామ చంద్ర పురం, కోడుమూరు, హంద్రీ కైరవడి, గోనెగండ్ల మీదుగా రాళ్లదొడ్డి చేరు కుంటారు. రాళ్లదొడ్డి రావడానికి ముందు భోజన విరామం తీసుకుంటారు. అనంతరం కడిమెట్ల మీదుగా బయలు దేరి సాయంత్రం 3గంటలకు ఎమ్మిగనూరులోని వీవర్స్ కాలనీ సొసైటీ గ్రౌండ్ దగ్గర బహిరంగ సభలో ప్రసంగిస్తారు. సభ అనంతరం అరెకల్, ఆదోని క్రాస్, విరుపా పురం, బెణిగేరి, ఆస్పరి, చిన్నహుల్తి, పత్తికొండ బైపాస్ మీదుగా కేజీఎన్ ఫంక్షన్ హాల్‌కు దగ్గరలో ఏర్పాటు చేసిన శిబిరంలో రాత్రికి బస చేస్తారు.

ప్రకాశం జిల్లాలో రూ.56 లక్షల నగదు స్వాధీనం

విశాలాంధ్ర - చీరాల రూరల్: ప్రకాశం జిల్లా చీరాల రూరల్ మండలం కావూరివారిపాలెంలో ఉన్న బాపట్ల నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి వేగేశన నరేంద్ర వర్మకు సంబంధించిన రాయల్ మెరైన్ కంపెనీలో గురువారం రూ. 56 లక్షల నగదును చీరాల పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు చీరాల డిఎస్పీ బేతపూడి ప్రసాద్, చీరాల రూరల్ సీఐ నిమ్మగడ్డ సత్యనారాయణ తమ సిబ్బందితో అక్కడకు వెళ్లి తనిఖీలు నిర్వహించి నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ కంపెనీలో నగదు స్వాధీనం చేసుకున్నామని నగదుకు సంబంధించిన వివరాలు సేకరిస్తున్నామని పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామన్నారు. కంపెనీలో 3 వేలకు మంది కార్మికులు సిబ్బంది పనిచేస్తుంటారని కొంతమంది కూలీలకు రోజువారి వేతనం చెల్లించేందుకు ఒకేసారి నగదు తెచ్చుకుంటామని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. అదేవిధంగా నెలాఖరు కావడంతో సెలవులు కూడా ఉండటంతో ముందస్తుగా అందరికీ జీతాలు ఇచ్చుకునేందుకు నగదును తీసుకొచ్చామని తెలిపారు. నగదుకు సంబంధించిన పూర్తి ఆధార పత్రాలు పోలీసులకి ఇచ్చామని వారు చెప్పారు.

సంపాదకీయం

జైలు నుంచి పాలన

ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టొరేట్ (ఇ.డి.) ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ను ఈ నెల 21న అరెస్టు చేసింది కనక ఆయనను పదవి నుంచి తొలగించాలని సుర్జీత్‌సింగ్ యాదవ్ పెట్టుకున్న ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని ఢిల్లీ హైకోర్టు గురువారం కొట్టేసింది. కేజ్రీవాల్ అరెస్టయిన తరవాత ఆయన రాజీనామా చేయలేదు. పదవిలో ఉండగా అరెస్టయిన మొదటి ముఖ్యమంత్రి కూడా ఆయనే. అధికారంలో ఉన్న ముఖ్యమంత్రిని అరెస్టు చేసిన పూర్వోదంతం లేదు. అరెస్టు అయిన తరవాత ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలన్న నియమేమీ లేదు కనక కేజ్రీవాల్ జైలు నుంచే పరిపాలన కొనసాగిస్తారని ఆమ్ ఆద్మీ పార్టీ మంత్రులు ఆయన అరెస్టు అయినప్పటి నుంచి చెప్తూనే ఉన్నారు. దానికి అనుగుణంగానే ఆయన నిర్బంధంలో ఉండగానే కేజ్రీవాల్ తన భార్య సునీతకు ఓ సందేశం పంపించారు. దాన్ని ఆమె విలేకరుల సమావేశంలో చదివి వినిపించారు. అంతే కాకుండా ఇద్దరు మంత్రులకు నిర్బంధం నుంచే కేజ్రీవాల్ రెండు ఆదేశాలు జారీ చేశారు. ఇ.డి. నిర్బంధంలో ఉండగా ఆయన ఈ పనులు ఎలా చేయగలిగారు, దానికి ఇ.డి. అధికారులు సహకరించారా, సమ్మతించారా అన్న ప్రశ్నలు తలెత్తుతాయి. కానీ అది విషయాంతరమే. అరెస్టు అయిన తరవాత కూడా నిర్బంధంలోంచే పరిపాలన కొనసాగిస్తానని కేజ్రీవాల్ ప్రకటించడమే కాక ఆ పని చేయడం ఓ వినూత్నమైన పరిస్థితికి అవకాశం ఇచ్చింది. ఆయన అరెస్టయిన తరవాత ఢిల్లీ శాసనసభ సమావేశం నిర్వహించారు. ఆయన వచ్చే ఒకటో తేదీదాకా ఇ.డి. నిర్బంధంలోనే ఉంటారు. ఆయన అరెస్టు ఉత్తర్వులను రద్దు చేయాలని కేజ్రీవాల్ పెట్టుకున్న అర్జీపై బుధవారం హైకోర్టులో విచారణ జరిగింది. హైకోర్టు ఆయనకు ఉపశమనం కలిగించలేదు కానీ ఆయన అర్జీకి సమాధానం ఇవ్వాలని ఇ.డి.ని ఆదేశించి రెండో తేదీదాకా గడువిచ్చింది. ఆయనను అరెస్టు చేసిన తరవాత గురువారం దాకా ఇ.డి. నిర్బంధంలో ఉంచుకోవడానికి అనుమతించారు. మళ్లీ ఆ నిర్బంధాన్ని ఒకటవ తేదీదాకా పొడిగించారు. అరెస్టయినందువల్ల ఆయన ముఖ్యమంత్రిగా కొనసాగడానికి వీలులేదని అందువల్ల ఆయనను తొలగించాలని సుర్జీత్ సింగ్ యాదవ్ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గురువారం ఈ పిటిషన్ ను విచారించిన ఢిల్లీ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి మన్ మోహన్, న్యాయమూర్తి మన్మీత్ అరోరాతో కూడిన బెంచి కేజ్రీవాల్ ను ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించడానికి నిరాకరించింది. అరెస్టయితే ముఖ్యమంత్రి పదవిలో ఉండకూడదని ఏ చట్టంలో చెప్పండి అని న్యాయమూర్తులు నిలదీశారు. అరెస్టు అయితే రాజీనామా చేయాలన్న నిబంధన ఏ చట్టంలోనూ లేని మాట నిజమే. అంతే కాక ముఖ్యమంత్రిని తొలగించే అంశం న్యాయస్థానం పరిధిలోకి రాదని కూడా న్యాయమూర్తులు చెప్పారు. ముఖ్యమంత్రిని తొలగించడం కార్యనిర్వాహక వర్గం చూసుకోవలసిన అంశం అని కూడా న్యాయమూర్తులు చెప్పారు. కేజ్రీవాల్‌ను ముఖ్యమంత్రి స్థానం నుంచి తొలగించడానికి రెండే మార్గాలు ఉన్నాయి. ఒకటి ఆమ్ ఆద్మీ పార్టీ శాసనసభా పక్షం సమావేశమై కొత్త నాయకుడిని ఎన్నుకోవడం. రెండవది: ముఖ్యమంత్రి అరెస్టు అయినందువల్ల అందుబాటులో లేరు కనక రాజ్యాంగం ప్రకారం పరిపాలనా నిర్వహణ సాధ్యం కావడంలేదు కనక ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ సిఫార్సు చేయడం. ఏ లెఫ్టినెంటు గవర్నరుకూ ఇప్పటి దాకా కేజ్రీవాల్‌తో సఖ్యతలేని మాట నిజమే కాని ప్రస్తుత లెఫ్టినెంటు గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనా ఇప్పటి దాకా ఈ విషయంలో ఎలాంటి వ్యాఖ్యా చేయలేదు.

జైలు నుంచే ఓ ముఖ్యమంత్రి పరిపాలన నిర్వహించిన సందర్భం ఇంతవరకు లేదు కనక దానికి సంబంధించి నిర్దిష్టమైన విధివిధానాలేమీ లేవు. అలా లేకపోవడం కేజ్రీవాల్ పదవిలో కొనసాగడానికి వీలుందా అన్నదీ పెద్ద ప్రశ్నే. నిర్దిష్టమైన నిబంధనలు, గతానుభవాలు లేవు కనక ఈ ప్రశ్నకు సమాధానం చెప్పడం కష్టమే. ముఖ్యమంత్రి ఆర్థిక కుంభకోణానికి పాల్పడ్డారన్న ఆరోపణ ఉంది కనక ఆయనను పదవిలో ఉండనివ్వకూడదన్నది ప్రజాప్రయోజనం వ్యాజ్యం దాఖలు చేసిన యాదవ్ వాదన. కేజ్రీవాల్ పదవిలో కొనసాగడం న్యాయ ప్రక్రియకు భంగం కలిగిస్తుందని, న్యాయానికి విఘాతం కలిగిస్తుందని, అందువల్ల రాజ్యాంగ యంత్రాంగం విఫలమవుతుందన్నది పిటిషనర్ వాదన. కానీ దాదాపు వారం నుంచి కేజ్రీవాల్ ఆదేశాలు పంపిన సందర్భాలున్నాయి కాని రాజ్యాంగ యంత్రాంగం విఫలమైందన్న వాదన వినిపించలేదు. రేపో మాపో పరిస్థితి మారినా మారొచ్చు. కేజ్రీవాల్ పదవిలో కొనసాగడం రాజ్యాంగంలోని 163, 164 అధికరణాలలోని కొన్ని భాగాలకు విరుద్ధమైనవని కూడా ప్రజా ప్రయోజన వ్యాజ్యంలో పేర్కొన్నారు. ఆయన నిర్బంధంలో ఉన్నందువల్ల తన అధికార బాధ్యతలు నిర్వహించే అర్హత కోల్పోయారని కూడా ఈ అర్జీలో వాదించారు. ఇప్పుడు ఏర్పడిన పరిస్థితి గతంలో ఎన్నడూ లేదు కనక దీనికీ సమాధానం అన్వేషించవలసిందే. నిర్బంధంలో ఉన్న ముఖ్యమంత్రి చట్టం ప్రకారం వ్యవహరించలేరన్నది మరో వాదన. పైగా ఆయన నిర్బంధంలో ఉండగానే పరిపాలనా బాధ్యతలు నిర్వర్తించాలంటే కొన్ని ఫైళ్లు పరిశీలించవలసి రావొచ్చు. వాటిలో బయటకు పొక్క కూడని అంశాలూ ఉండొచ్చు. ఈ అంశాలన్ని జైలు అధికారులు కూలంకషంగా పరిశీలించి ఫైళ్ల లాంటివి అందిస్తారా, కేజ్రీవాల్ చేసే సూచనలను, ఆదేశాలను మంత్రివర్గానికో, పాలనా విభాగానికి అందజేసే మార్గం ఏమిటి అన్న సందేహాలూ ఉన్నాయి. ఈ ప్రక్రియ అంతా సాధ్యం అవుతుందనుకున్నా రహస్యాలను కాపాడతానని ముఖ్యమంత్రి చేసిన ప్రమాణానికి భంగం కలగదా అన్నది మరో ప్రశ్న. అరెస్టయిన ముఖ్యమంత్రి నిర్బంధంలో ఉండగానే పరిపాలనా బాధ్యతలు నిర్వర్తించడానికి ఫైళ్లు పరిశీలించడం అవసరం. ఢిల్లీ పాలనా యంత్రాంగానికి సంబంధించిన 1993 నాటి నిబంధనల ప్రకారం ముఖ్యమంత్రికి ఫైళ్లు చూసే అధికారం ఉంటుంది. ఆరోపణలు ఉన్న వ్యక్తే ఈ ఫైళ్లు చూసే అవకాశం ఉండకూడదన్నది ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసిన యాదవ్ బాధ. ముఖ్యమంత్రి మీద ఆరోపణలు ఉన్నాయి కనక ఆ ఫైళ్లు చూస్తే పరిస్థితి ఏమిటన్నది మరో సమస్య. కేజ్రీవాల్ జైలు నుంచి ఆదేశాలు జారీ చేయకుండా నివారించాలని అభ్యర్థిస్తూ సుర్జిత్ సింగ్ యాదవ్ మరో ప్రజా ప్రయోజన వ్యాజ్యం కూడా దాఖలు చేశారు. ఇది ఇంకా విచారణ దశకు రాలేదు. ఈ వాదోపవాదాలన్నీ న్యాయానికి, చట్టానికి సంబంధించిన అంశాలు. ఇలాంటి పరిస్థితి వస్తుందని ఊహించనందువల్ల దీనికి సంబంధించిన చట్టాలు, నిబంధనలు లేకపోవడం విచిత్రం కాదు. ఆమ్ ఆద్మీ పార్టీ శాసనసభాపక్షానికి ఇప్పటికీ కేజ్రీవాల్ మీద సంపూర్ణమైన విశ్వాసం ఉంది. లెఫ్టినెంట్ గవర్నర్ నుంచి ప్రతికూల స్పందన ఇంతవరకు రాలేదు. ఆదేశాలు జారీ చేయడం, సందేశాలు పంపడం, దానికోసం ఏర్పాట్లు చేయడం అంత క్లిష్టమైంది కాకపోవచ్చు. కానీ సమీక్షా సమావేశాలు, మంత్రివర్గ సమావేశం నిర్వహించాలని ముఖ్యమత్రి భావిస్తే దానికి ఏర్పాట్లు ఎవరు చేయాలన్నదీ సమాధనం లేని ప్రశ్నే.

వామపక్ష విద్యార్థి సంఘాల ఆదర్శం

అరుణ్ శ్రీ వత్సవ

ఢిల్లీ జేఎన్‌యూ విశ్వవిద్యాలయంలో జరిగిన విద్యార్థి సంఘాల ఎన్నికల్లో వామపక్ష విద్యార్థిసంఘాలు, దళిత విద్యార్థినాయకుడుకలిసి పోటీ చేసి ఘనవిజయం సాధించారు. మొదటిసారిగా అంటే 27ఏళ్ల తర్వాత దళితవిద్యార్థి (ఏఐఎస్ఏ)విద్యార్థి యూనియన్ అధ్యక్షుడు ధనుంజయ్ ఎన్నికయ్యారు. వామపక్ష, మితవాద శక్తులమధ్య ఈ ఎన్నికల పోరాటం జరిగింది. వామపక్ష విద్యార్థుల విజయం వామపక్ష రాజకీయ పార్టీలకు ఆదర్శనీయమైంది. వామపక్ష పార్టీలు, దళితులు సమైక్యంగా కార్యకలాపాలను నిర్వహించినట్లయితే మత, మితవాద శక్తులను ఎన్నికల్లో ఓడించడానికి వీలవుతుంది. చాలాకాలం నుంచి వామపక్షశక్తుల ఐక్యత దేశానికి ప్రయోజనం కలిగిస్తుందన్న అభిప్రాయం బలంగా వ్యక్తమవుతోంది. 2014లో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జెఎన్‌యూలో అన్ని డిపార్టుమెంట్లలో వామపక్ష బోధకులను ఉద్యోగాలలో లేకుండా చేయాలని అన్నిరకాల ప్రయత్నాలను చేశారు. వామపక్ష విద్యార్థులలో కూడా యూనివర్సిటీలో పెరగకుండా అణచివేయాలని వ్యూహాలు పన్నారు. ఏబీవీపీ, సంఘ్‌పరివార్ శక్తులు వామపక్ష విద్యార్థిసంఘాలను ఎదగకుండా చేయాలని అనేక వ్యూహాలు పన్నారు. దీర్ఘకాలంగా జేఎన్‌యూ వామపక్ష విద్యార్థులకు, ఉపాధ్యాయులకు బలమైన స్థావరంగా ఉన్నది. నరేంద్ర మోదీ ప్రధానిగా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినతర్వాత వామపక్ష శక్తులను జెఎన్‌యూ నుంచి పూర్తిగా లేకుండా చేయాలని సంఘ్‌పరివార్ పూనుకున్నది. వామపక్ష విద్యార్థులు జాతీయ వ్యతిరేక శక్తులని ఆర్‌ఎస్ఎస్, బీజేపీ చివరకు ప్రధాని మోదీ ఆరోపిస్తూ అనేకమంది వామపక్ష విద్యార్థులను అరెస్టుచేయించి జైలుకు పంపారు. ఎటువంటి తప్పుచేయని జెఎన్‌యూ విద్యార్థి సంఘ నాయకుడు, స్కాలర్ ఒమర ఖాలిద్‌పై దేశవ్యతిరేకశక్తి అనే ఆరోపణచేస్తూ జైలుకు పంపారు. ఇప్పటికే ఆయన జైలులోనే ఉన్నారు. పౌరసత్వం సవరణ చట్టానికి(సీఏఏ) వ్యతిరేకంగా నిరసన తెలియజేసినందుకే ఉమర్ ఖాలిద్‌ను అరెస్టు చేశారు.

జెఎన్‌యూలో ఆర్‌ఎస్ఎస్, ఏబీవీపీలు విద్యార్థులందరినీ తమవైపు ఆకర్షించాలని పూనుకున్నప్పటికీ సాధ్యం కావడంలేదు. పైగా వామపక్ష విద్యార్థులను 'తుక్‌డే తుక్‌డే' గ్యాంగు అంటూ ఈ విద్యార్థులు పాకిస్థాన్‌కు అనుకూలంగా పనిచేస్తున్నారని కూడా సంఘ్‌పరివార్ శక్తులు ఆరోపించాయి. దాదాపు అన్ని విద్యార్థిసంఘాల నాయకులపై అత్యంత క్రూరమైన జాతివ్యతిరేక చట్టాలకింద కేసు నమోదు చేశారు. యూనివర్సిటీల్లో పాలనా యంత్రాంగాన్ని మోదీ ప్రభుత్వం తమకు అనుకూలమైనవారిని నియమించింది. అలాగే బోధకులను కూడా తమకు అనుకూలమైనవారిని, విద్యా ప్రమాణాలు లేనివారిని నియమించడంవల్ల బోధన నాణ్యతలేకుండా బలహీనమైపోయింది. ఆర్‌ఎస్ఎస్ భావజాలం కలిగిన వారిని బోధకులుగా నియమించడం వల్ల విద్యలో ప్రామాణికత లోపించింది. వామపక్ష విద్యార్థులంతా కలిసికట్టుగా ఎన్నికల్లో పాల్గొనడం అన్నివామపక్షాలు మార్గదర్శకంగా తీసుకోవలసిన అవసరం ఉంది. వామపక్షపార్టీల నాయకులు ఐక్యతకోసం గట్టిగా కృషి చేసినట్లయితే సాధ్యమవుతుందని అనేక మంది పార్టీ అభిమానులు, కార్యకర్తలు కూడా భావిస్తున్నారు. జెఎన్‌యూలో వామపక్ష విద్యార్థిసంఘాలు ఐక్యమైనప్పుడు విజయాలను సాధిస్తూనేఉన్నాయి. ఈసారి సీపీఐ, ఎంఎల్, లిబరేషన్‌కు అనుకూలమైన ఏఐఎస్ఏ నాయకుడు ధనుంజయ్ అధ్యక్షుడుగా ఎన్నిక కావడానికి కృషిచేసింది. ఇతర సంఘాలను కలుపుకునిపోయేందుకు ఏఐఎస్ఏ చొరవతీసుకున్నది. ఐక్యవామపక్ష విద్యార్థులు ఒక్కటిగా నిలిచారు. ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఏఐఎస్ఏ, డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్(డిఎస్ఎఫ్) విద్యార్థులు వివిధ పదవు లకు ఎన్నికయ్యారు. కాషాయదళాలు అన్ని విశ్వవిద్యా లయాల్లోనూ తమకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించేందుకు ప్రయత్ని స్తున్నారు. ఇందుకు వ్యతిరేకించినవారిపైన దాడులు చేస్తున్నారు. బీజేపీకి ఓటువేసే విద్యార్థులనే ప్రోత్సహిస్తున్నారు. వర్సిటీలపై మత,మితవాద శక్తులుదాడులు సాగించి వామపక్ష విద్యార్థులపై తప్పుడు కేసులు బనాయించి హింసించారు. 5ఏళ్ల తర్వాత 2024లో జరగనున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని యూనివర్సిటీలో గెలుపొం దేందుకు సంఘ్‌పరివార్ శక్తులు గట్టిగా పనిచేశాయి. అయినప్పటికీ వామపక్ష విద్యార్థులు ఒక్కటిగానిలిచి గెలుపొందారు. గతంలో ఏఐఎస్ఎఫ్ నాయకుడు కన్హయకుమార్, జెఎన్‌యూ విద్యార్థిసంఘ అధ్యక్షుడుగా పనిచేశారు. అయనపైనకూడా దేశద్రోహ నేరంమోపి జైలుపాలు చేశారు. ఈ విధంగా ఆర్‌ఎస్ఎస్ అనుబంధ శక్తులన్నీ కలిసి అన్ని వర్సిటీలలో, తమకు అనుకూల వాతావరణాన్ని సృష్టించేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉన్నారు.

బీజేపీతో కలిస్తే దేవతల పాలనా?

జి.ఓబులేసు

మార్చి 27న ఒక ప్రముఖ దినపత్రికలో "ఈ దానవ పాలన అంతానికి సహకరిద్దాం కామ్రేడ్స్" శీర్షికన వ్యాసం ప్రచురితమైంది. ఆడలేక మద్దెల ఓడు అన్నట్లు జగన్ రాక్షస పాలనను ఎదిరించలేక అంతకన్నా పెద్దరాక్షసి బీజేపీని కలుపుకొని దానవపాలన అంతానికి కలిసివచ్చే అవకాశానికి కమ్యూనిస్టులు అడ్డుపడుతున్నట్లు మేఘనాథ్ రెడ్డి విలపించారు. వ్యాసం ముగింపులో ఒకేసారి ఇద్దరు రాక్షసులతో పోరాడే శక్తి తెలుగు ప్రజలకు లేదు కాబట్టి పెద్ద రాక్షసి బీజేపీ సహకారంతో చిన్న రాకాసి జగన్‌ను సాగనంపడానికి కామ్రేడ్స్‌ను కలసిరావాలని కోరుతూ గతంలో కలసిపోయారు కదా! ఇప్పుడెందుకు ఎత్తుగడలు- వ్యూహంతో అడ్డుపడు తున్నారని ప్రశ్నించారు. వివిధ సందర్భాల్లో వ్యూహం-ఎత్తుగడల అర్థం -నిర్వచనం మేఘనాథరెడ్డికి తెలిసి వాడినట్లుగా కనిపించదు. వ్యూహం దీర్ఘకాలికం- ఎత్తుగడ తాత్కాలికం. 1967 ఐక్యసంఘటన ఎత్తుగడలు 2024 ఎన్నికలకు ఎలా వర్తింపచేయాలో కమ్యూనిస్టులకు మేఘనాథరెడ్డి బోధిస్తున్నారు. పెద్ద రక్కసిని దెబ్బ తీయాలంటే చిన్నరాకాసితో చేతులు కలపాలంటారు. కేరళలో ముస్లిమ్ లీగుతో జత కట్టారుకదా- ఇపుడు మతతత్వ పార్టీ అయిన బీజేపీతో బాబు కలిస్తే మీరు కలవాలి కానీ ఎడంగా ఉంటూ శాపనార్థాలు పెట్టడం దేనికి అంటూ తలాతోక లేకుండా మాట్లాడుతున్నారు. స్వాతంత్ర్యం కొరకు జరిగిన సంగ్రామంలో మత్స్యకారులు మొదటగా కమ్యూనిస్టు, కాంగ్రెస్, ముస్లిం లీగు జెండాలు పడవులకు కట్టి ఊరేగించారు. ఆ స్వాతంత్ర్యపోరులో నేటి బీజేపీ పూర్వనామమైన జనసంఘ్ లేదు. పైగా వారికి తొత్తుగా వ్యవహరించినారు. నాటి ముస్లిమ్ లీగు పార్టీ దేశభక్తిని చాటుకుంది. 1985 ఎన్నికల్లో యన్‌టిఆర్ ఒకవైపు బీజేపీ- మరోవైపు కమ్యూనిస్టులతో కలిసివెళ్లారు. మరిఇపుడు బాబు బీజేపీతో కలిస్తే మీరెందుకు దూరంగా ఉంటారు అని బాధ, ఆక్రోశం వెళ్లగక్కారు.

1985 నాటికి దేశంలో కాంగ్రెసు ఏకపక్ష నిర్ణయాలు, రాష్ట్రాలను ఢిల్లీకి గులాంలుచేసి పెండ్లిలో వధూవరులు బట్టలు మార్చినట్లు ముఖ్యమంత్రులను మార్చుచేయటం రాష్ట్రాల స్వతంత్రత, స్వేచ్ఛాభిమానాలను హరించే పద్ధతి తారాస్థాయికి చేరింది. ఆ స్థితిలో తెలుగువారి ఆత్మగౌరవ నినాదంతో ఆవిర్భవించిన టీడీపీ చెప్పినమాటకు కట్టుబడే ఆ పార్టీ సారథి యన్‌టిఆర్, ప్రజాస్వామ్య పరిరక్షణ పేరుతో సాగుతున్న మహోద్యమంలో కమ్యూనిస్టులు ఇరుసుగా పనిచేసారు. ఆ సమయంలో వచ్చిన ఎన్నికల్లో యన్‌టిఆర్ గెలుపునకు సహకరిస్తూ నాదెండ్ల భాస్కరరావు రూపంలో కాంగ్రెసు ఆడిన దుర్నాటకానికి తెరదించడానికి కమ్యూనిస్టులు కాంగ్రెసుతో, బీజేపీతో పోరాడుతూనే యన్‌టిఆర్‌కు సహకరించారు.

నాటి రాజకీయ పరిస్థితికి, నేటి స్థితికి పొంతనేలేదు. యన్‌టిఆర్ నిజాయితీగా కమ్యూనిస్టులతో చెప్పేవాడు, బీజేపీ సహాయం పొందారు. మరినేడు ఏమి జరిగింది? చంద్రబాబు రాష్ట్ర ప్రజలను, దానవపాలనకు వ్యతిరేకంగా నిలబడి పోరాడుతున్న ప్రతిపక్షాలతో మాటవరసకైనా , మర్యాదకైనా చెప్పకుండా అసురపార్టీని కావలించుకోవటం దేనికి- దానికి వంచనతోకూడిన రాష్ట్రహితం, రాష్ట్రాభివృద్ధి అని సూత్రీకరణచేసి తన స్వార్థ రాజకీయ పదవికొరకు వెంపర్లాడడాన్ని ఎలా సమర్థించుకుంటారు. బాబు భయంతో బీజేపీతో జతకడితే దానవపాలన అంతానికి అనే నమ్మాలా?

యన్‌డీఏతో ఉంటేనే అభివృద్ధి అని బాబు, పవన్ వారికి వంతపాడే మేధావులు,ప్రసార మాధ్యమాలు తెగ ప్రచారం చేస్తున్నారు. 2015 నుంచి 2019 వరకూ ఇపుడు గొప్పపాలనా దక్షుడుగా, ముందుచూపు, దీర్ఘదృష్టి కలిగిన 40 ఇయర్స్ ఇండస్ట్రీఅనుభవంతో కేంద్రంలో ఉన్న ఎన్‌డీఏ పాలనలో భాగస్వామి. బీజేపీ కూడా ఇక్కడ రాష్ట్రంలో బాబు పాలనలో భాగస్వామియే కదా? మరలాంటప్పుడు 2014 పునర్విభజన చట్ట హామీలు సెక్షన్ 46 (వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేకనిధులు) సెక్షన్ 93, సెక్షన్ 94లో పేర్కొన్న విద్య, వైద్య సంస్థల ఏర్పాటు ప్రత్యేక తరగతి హోదా, పోలవరం, కడప స్టీలు ప్లాంటు నిర్మాణాలు ఏమైనాయి. ఎన్‌డీఏలో ఉండి వాటన్నింటిని మోదీ షాపు దగ్గర తాకట్టుపెట్టి మోదీ గ్రాఫ్ తగ్గిందని- దింపుడు కల్లాల ఆశతో ఆఖరు నిమిషంలో బైటకువచ్చి ధర్మపోరాట దీక్షలతో దొంగనాటకాలు ఆడినా జనం పట్టించుకోలేదు. నేడు బాబు డ్రామాలవల్లే రాష్ట్రంలో దానవపాలన వచ్చింది. కేంద్రంలో ఇంతకు పదింతలు దుష్టపాలన జరుగుతున్నది. ఆ దుష్టపాలనకు ఉపకరించే అన్ని బిల్లులకు, పార్లమెంటులో మద్దతు ఇస్తూవచ్చారు. ఇప్పుడు రాష్ట్రాభివృద్ధి, వ్యవస్థలను గాడిలో పెట్టడానికని కరుడుకట్టిన కమ్యూనల్, కార్పొరేట్, అవినీతి, క్రిమినల్‌పార్టీ బీజేపీని నోటా కన్నా తక్కువ ఓట్లువచ్చిన బీజేపీ అనే రాక్షసిని తాను నెత్తినపెట్టుకుని ఊరేగుతూ నట్టింట స్థానం కల్పిస్తూఉంటే కామ్రేడ్స్ ఎత్తుగడల పేరుతో అడ్డుకాలు వేయటం ఏమిటి,వంతపాడకుండా ఒక శాతం ఓట్లుకూడా లేవని, బీజేపీతో జత కలిస్తే వచ్చే ఓట్లు తగ్గుతాయని బాబుకు తెలియదా? బాబు ఏ చెత్తపని చేసినా కామ్రేడ్స్ కలసిరావాలి. లేకపోతే చట్టసభల్లో ప్రవేశించి ఎన్నికల రాజకీయాలు, విప్లవోద్యమం నడపడంలో వైఫల్యాలు అని దుమ్మెత్తిపోయటానికి కుహనా మేధావులు పుట్టుకు వస్తారు. కేంద్రంలో, రాష్ట్రంలో జరుగుతున్న అరాచకపాలనకు వ్యతిరేకంగా నిరంతరం పోరాడుతున్నది. ఉద్యమాలు చేస్తున్నది కమ్యూనిస్టులే అన్నవాస్తవాన్ని మరచి మీడియా ద్వారా హంగామా చేసేవారు దానవపాలన అంతానికి నడుంకట్టినట్లు దేశాభివృద్ధి, రాష్ట్ర హితం కోసం అనడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు కాదా? బీజేపీ ఎంత ప్రమాదకరంగా తయారైందో మణిపూర్ సంఘటన, రెజ్లర్లపై అఘాయిత్యం, ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలను పడగొట్టి తమ చేతికిందకు తెచ్చుకోవటం, అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతుండటం, ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరించడం, కార్పొరేటు రంగానికి అప్పచెప్పటం, ప్రతిపక్షపార్టీలు కాంగ్రెసు అకౌంట్స్ సీజ్ చేయటం, కేజ్రీవాల్ అక్రమ అరెస్టు, ఎదురుతిరిగే వారందరిపై ఈడీ, సీబీఐ,ఐటి దాడులు జరుగుతున్నా బాబు అండ్ కో కు జ్ఞానోదయం కలగలేదు. ఎవరు ఎట్లాపోతే మాకేంటి మాకు అధికారం ముఖ్యం. దాన్ని కైవసం చేసుకోవ టానికి దెయ్యాలతో కూడా చేతులు కలుపుతాం. మీరురండి అంటే కమ్యూనిస్టులు మీ మాదిరి ఊసరవెల్లి రాజకీయాలు చేయరు. చేయలేరు.కాంగ్రెసు, కమ్యూనిస్టులు, ఇండియా కూటమి జోగి జోగిరాసుకుంటే బూడిదవుతుంది అనే సన్యాసులు మరి ఈ ఈకూటమి ఏర్పాటు, ఎన్నికల పోరాటానికి బెంబేలు ఎత్తడం దేనికి. ఈ మధ్య వారం రోజుల కిందట మాజీ ఐఏఎస్ అఫీసరు జేపీ సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో చేయగల్గిన నాయకులు మోదీ, బాబు, పవన్‌లు గనుక నేను వారికి మద్దతు పలుకుతున్నానని పత్రికా సమావేశంలో చెప్పారు. అంతకుముందంతా జగన్ పాత పెన్షన్‌కు వ్యతిరేకంగా ఉండటాన్ని సమర్థిస్తూ మాట్లాడిన పెద్దమనిషి ఇప్పుడు పెన్షన్-మద్యం ధరలు తగ్గించి- నాణ్యమైన మద్యాన్ని అందిస్తానని చెప్పారు. 8,10,000 కోట్లు ప్రస్తుతం అప్పులున్నా, బాబు అమలుకు సాధ్యంకాని వాగ్దానాలతో ఏమి అభివృద్ధి సాధిస్తారు? నరంలేని నాలుక ఎలాగైనా తిరుగుతుంది అన్ననానుడిని సో కాల్డ్ మేథావులు రుజువు చేస్తున్నారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు

ప్రజాశక్తిని చాటిన ఐరాస తీర్మానం

బెన్‌చాకొ

గాజాలో కాల్పుల విరమణకు సంబంధించి ఐక్యరాజ్య సమితి సోమవారం తీర్మానాన్ని ఆమోదించడం ప్రజాశక్తిని చాటిచెపుతోంది. ఐక్యరాజ్య సమితి తీర్మానం క్షేత్రస్థాయిలో పటిష్ఠవంతంగా అమలుజరిగేలా చూడడం తదుపరి దశ కార్యాచరణ. దాదాపు ఆరునెలలుగా ఇజ్రాయిల్-పలస్తీనా గాజాప్రాంతంలో బాంబులు కురిపించి మారణకాండ జరిపిన తర్వాత ఐక్యరాజ్యాసమితి భద్రతామండలి తక్షణం కాల్పుల విరమణ తీర్మానాన్ని ఆమోదించింది. ప్రపంచవ్యాప్తంగా ఇజ్రాయిల్ దుర్మార్గాన్ని ఖండిస్తూ అనేక దేశాల్లో లక్షలాదిమంది ప్రదర్శనలు జరిపారు. గత అక్టోబరు 7న రాత్రి హమాస్ పోరాటదళాలు ఇజ్రాయిల్‌పై దాడి జరిపాయి. దాడిలో దాదాపు 1400 మంది మృతిచెందారు. దాదాపు ఏడు దశాబ్దాలుగా ఇజ్రాయిల్ పలస్తీనాపై హింసాకాండ జరుపుతోంది. దీన్ని భరించలేని హమాస్ వీరులు ఇజ్రాయిల్‌పై బాంబులతో దాడిచేశారు. దీంతో ఇజ్రాయిల్ సైన్యం రెచ్చిపోయి గాజాలో ఆస్పత్రులపైన, జనావాసాలపైన బాంబులు కురిపించి పిల్లలు, స్త్రీలు అనే విచక్షణలేకుండా ఇంతవరకు 30వేల మందికిపై ప్రజలను చంపి వేశారు.

ప్రపంచంలో వందకుపైగా దేశాలు పలస్తీనాకు మద్దతు తెలిపాయి. ఐక్యరాజ్యసమితి సైతం ఇజ్రాయిల్ హింసాకాండను ఖండిస్తూ కాల్పుల విరమణకు తీర్మానం చేసింది. ఇజ్రాయిల్ యుద్ధకాండకు అమెరికా, నాటో దేశాలు, పశ్చిమ దేశాలు మద్దతు తెలిపాయి. అయితే క్రమంగా ఇజ్రాయిల్‌ను సమర్థించే దేశాలు తగ్గిపోయాయి. ఇటీవల అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సైతం ఇజ్రాయిల్ కాల్పులు విరమించాలని కోరారు. అధ్యక్ష ఎన్నికలు జరగనున్న సందర్భంగా కాల్పుల విరమణపై బైడెన్ మాట్లాడారు. ఆరునెలలుగా ఇజ్రాయిల్‌కు అన్ని విధాలుగా సహాయం చేస్తూ ఆయుధాలను విక్రయిస్తూ ప్రయోజనం పొందుతోంది. పలస్తీనా నగరాలను, పట్టణాలను ధ్వంసం చేశారు. గాజా ప్రాంతంలోని లక్షలాదిమంది ప్రజలు ప్రాణాలు కాపాడుకునేందుకు ఇతర ప్రాంతాలకు తరలిపోయారు. ఆహారం, మందులు తదితర వస్తువులను గాజా ప్రాంత ప్రజలకు అందకుండా ఇజ్రాయిల్ సైన్యం అడ్డుకుంటోంది. ఏ మాత్రం మానవత్వం లేకుండా

చంటిపిల్లలున్న ఆస్పత్రులపైన కావాలని బాంబులు కురిపించి హతమార్చారు. ఆహార వస్తువులను విమానాలు, హెలికాప్టర్ల ద్వారా కిందకు జారవిడుస్తుండగా వాటిని తీసుకునేందుకు పరుగులు పెడుతున్న పిల్లలు, స్త్రీలపై బాంబులువేసి వందలాదిమందిని హతమార్చారు. ప్రతిరోజు ఇలాంటి దుర్మార్గాలకే పాల్పడుతున్నారు. పలస్తీనా ప్రాంతాన్ని పూర్తిగా నాశనం చేస్తామని ఇజ్రాయిల్ అధ్యక్షుడు బెంజమిన్ నెతన్యాహు ప్రకటించారు.

గత రెండు నెలలుగా కాల్పుల విరమణ తీర్మానానికి బ్రిటన్, అమెరికాలు వ్యతిరేకిస్తూనే ఉన్నాయి. భద్రతామండలి సమావేశానికి బ్రిటన్ హాజరుకావడం లేదు. అమెరికా వీటో చేసింది. సోమవారం భద్రతామండలి కాల్పులవిరమణ తీర్మానాన్ని అమోదించింది. కాల్పులు విరమించి శాంతిని నెలకొల్పాలని బ్రిటన్, అమెరికా తదితర పశ్చిమదేశాల్లో వేలాదిమంది తాజాగా ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు జరుపుతున్నారు. సోమవారం సమావేశానికి అమెరికా హాజరుకాలేదు. బ్రిటన్‌లో అత్యంత భారీగా శాంతికాముకులు అనేక ప్రధాన వీధుల్లో ప్రదర్శనలు, ధర్నాలు జరుపుతున్నారు. ప్రధానమంత్రి పదవి నుంచి వైదొలగాలని డిమాండ్ చేస్తున్నారు. సెంట్రల్ లండన్ ప్రాంతాల్లో ఇటీవలికాలంలో ఏనాడూ జరగనంత భారీగా నిరసన ప్రదర్శనలు చేస్తూ మంత్రులను సైతం ఈ మార్గాల్లో తిరగకుండా నిలువ రించారు. ప్రభుత్వం మాత్రం ప్రదర్శనలను వ్యతిరేకిస్తూ గాజాపై మరింత కఠినమైన చర్యలు చేపట్టాలని కోరుతూ వచ్చింది. ఎట్టకేలకు రంజాన్ పండుగ ముగిసేవరకు కాల్పుల విరమణకు అనుమతించింది. కార్మిక నాయకులు కాల్పుల విరమణకు మద్దతు తెలియజేశారు. ప్రపంచవ్యాప్తంగా ప్రజలు పలస్తీనాకు మద్దతు తెలియజేస్తూ ఇజ్రాయిల్ చర్యలను ఖండిస్తున్నందున ఈ తీర్మానాన్ని పశ్చిమదేశాలు అనుమతించాయి. అయితే తీర్మానాన్ని అమలు చేయడం అతి ముఖ్యమైన అంశం. బ్రస్సెల్స్, లండన్, వాషింగ్టన్ తదితర నగరాల్లో కాల్పుల విరమణకు దౌత్యవేత్తలు అనుకూలతను ప్రదర్శించాలని, లేకుంటే అంతర్జాతీయంగా ప్రభుత్వాలు ప్రజల మద్దతును కోల్పోతాయని హెచ్చరించారు. ప్రజలు పశ్చిమాసియా ప్రాంతంలోని పలస్తీనాకు మద్దతు పలుకుతూ అమెరికాను వ్యతిరేకిస్తున్నారు. ఇజ్రాయిల్‌పై యెమెన్ దాడులను అమెరికా నిలువరించలేకపోతోంది. ఇజ్రాయిల్‌కు సంబంధించిన నౌకలపై యెమెన్ దాడులు సాగిస్తోంది. అమెరికా అధ్యక్షుడు ప్రయాణించే మార్గాలలో భారీగా ధర్నాలు జరుగుతున్నందున, ఆయన మరో మార్గంలో కార్యాలయానికి వెళ్లవలసి వస్తోంది. ఈ పరిస్థితిపై డెమొక్రాట్లు, పార్టీ నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భద్రతామండలి కాల్పుల విరమణకు తీర్మానం చేయడం చరిత్రాత్మకమైనది. ఈ తీర్మానాన్ని ఇజ్రాయిల్, ఇతర ఐరాస సభ్యదేశాలు తప్పక అమలు చేయవలసి ఉంటుందని చైనా రాయబారి ఝాంగ్‌జన్ అన్నారు. ఇతర సభ్యదేశాలు కాల్పుల విరమణ అమలుకు కృషిచేస్తామని ప్రకటించాయి. తీర్మానం చేసిన తర్వాత కూడా బ్రిటన్ ఆయుధాలను సరఫరా చేసినట్లయితే మా మద్దతకు అర్థం ఉండదు. తమపై ఒత్తిడిచేస్తున్నందున అమెరికాను శిక్షించాలని ఇజ్రాయిల్ మాట్లాడుతోంది. దౌత్యవేత్తలు గాజా ప్రాంతాన్ని సందర్శించాలని అక్కడ జరుగుతున్న పరిణామాలను, దారుణ హింసాకాండను గుర్తించాలని, ఒకవేళ తిరస్కరిస్తే తగిన మూల్యం చెల్లించవలసివస్తుందని ధర్నా చేస్తున్న ప్రజలు హెచ్చరించారు. గాజాలో శాంతికోసం మరో జాతీయ ప్రదర్శన రానున్న శనివారం బ్రిటన్‌లో జరుగనున్నది. న్యూయార్క్‌లోను భారీ ప్రదర్శనే జరుగుతుందని ప్రకటించారు. ఇజ్రాయిల్ దాడులపై బ్రిటన్ నిర్లక్ష్యంగా ఉందని, యుద్ధాన్ని పూర్తిగా నిలిపివేయాలని, పలస్తీనాను అక్రమంగా ఆక్రమించిందని దీనికి అంతం పలకాలని ప్రదర్శనల నిర్వాహకులు డిమాండ్ చేశారు.

ఎన్నికలు బహిష్కరిస్తాం

- కుకీ యువత, మహిళా సంఘాల ప్రకటన
- అర్థవంత శాంతి చర్చలకు పిలుపు
- సమస్యల పరిష్కారానికి డిమాండ్

ఇంఫాల్: తమకు జరిగిన అన్యాయానికి నిరసనగా సార్వత్రిక ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు కుకీ వర్గానికి చెందిన యువత, మహిళా సంఘాలు ప్రకటించాయి. ఈ సమ్మిళిత నిర్ణయం ద్వారా పాలకులు, ప్రభుత్వ అధికారుల తీరును ఖండించడమే కాకుండా తమ వర్గానికి న్యాయం చేయాలని కోరుతున్నట్లు వెల్లడించాయి. కుకీ, మయితే వర్గీయుల పోరుతో మణిపూర్‌లో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయి. 2023 మే నుంచి ఈశాన్య రాష్ట్రం అట్టుడికిపోతోంది. కేంద్రంతో పాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తమను పట్టించుకోలేదని కుకీలు మండిపడ్డారు. తమ వెతలను నిర్లక్ష్యం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇందుకోసమే సార్వత్రిక ఎన్నికలను బహిష్కరించాలని నిర్ణయించుకున్నట్లు యువజన సంఘాలతో పాటు అంతర్జాతీయ కుకీ మహిళా సంఘాల ప్రతినిధులు ఒక ప్రకటన చేశారు. అర్థవంతమైన శాంతి చర్చలకు పిలుపునిచ్చారు.

'రాష్ట్రంలో హింస చెలరేగినప్పటి నుంచి కుకీలకు తీరని అన్యాయం జరిగింది. మా సమస్యలను పాలకులు నిర్లక్ష్యం చేశారు. అందుకే లోక్‌సభ ఎన్నికలను బహిష్కరించాలని నిర్ణయించుకున్నాం. దాదాపు ఏడాది కావస్తున్నా కుకీలపై హింస కొనసాగుతున్న దృష్ట్యా ఈ కఠిన నిర్ణయం తప్పలేదు. హింసాకాండ ఆగడంలేదు. ఇప్పటికే అనేక మంది సర్వం కోల్పోయారు. నిరాశ్రయులయ్యారు. నిస్సహాయ కుకీలకు ఆపన్నహస్తం కరవైంది. కుకీ మహిళలపై నేరాలను పాలకులు పట్టించుకోలేదు. ముఖ్యమంత్రి, ప్రభుత్వ అధికారులు మా వర్గాన్ని దూషించారు. వారిపై చర్యలు తీసుకోలేదు. మమ్మల్ని కోతులని సీఎం అన్నారు. మమ్మల్ని కించపర్చినా... ఎవరికి జవాబుదారీతనం లేదు. ఎన్నికలను బహిష్కరించడం ద్వారా సమ్మిళిత అసమ్మతిని వ్యక్తం చేయడమే కాకుండా మా వర్గ పరిస్థితుల వైపునకు దృష్టిని మళ్లించి, వాటి పరిష్కారం కోసం యుద్ధప్రాతిపదికన చర్యలను డిమాండ్ చేస్తున్నాం. ఇది న్యాయం కోసం, మా హక్కుల పరిరక్షణ కోసం పిలుపు. మా వెతలను తీర్చాలనే వినతి' అని ప్రకటన వెల్లడించింది. కేంద్రంలో నిర్మాణాత్మక చర్చలకు తమ సంఘాలు సిద్ధంగా ఉన్నాయని, సమస్యలు పరిష్కారమయ్యేలా శాంతి నెలకొల్పేందుకు అర్థవంతమైన చర్చలను స్వాగతిస్తామని కుకీ సంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు. ఎన్నికల బహిష్కరణ నిర్ణయానికి కుకీ జో వర్గం మద్దతిచ్చింది. 15కుపైగా కుకీ జో హమర్ మహిళా సంఘాలు కూడా సమర్థించాయి. అదే సమయంలో తాము ఈ నిర్ణయానికి రావడానికిగల కొన్ని ప్రధాన కారణాలను వెల్లడించాయి. గిరిజనులు కనీస వసతులకు నోచుకోవడం లేదని పేర్కొన్నాయి. కుకీలు ఉండే ప్రాంతాల్లో సరైన రోడ్లు, తాగునీరు, వీధి దీపాలు లేవని తెలిపాయి. 'కుకీ–జో వర్గానికి చెందిన 20 మంది మహిళలు మయితే వర్గీయుల దురాగతాలకు బాధితులయ్యారు. వారు హత్యాచారానికి/ మూక హత్యలకు గురయ్యారు. నగ్నంగా ఊరేగించబడ్డారు. సజీవంగా దహనం చేయబడ్డారు. హింసలో 168 మందికిపైగా కుకీ–జో వర్గీయులు చనిపోయారు. ఎన్ఐఏగానీ సీబీఐగానీ విచారణ జరిపించలేదు. 360కుపైగా కుకీ–జో వర్గీయుల ప్రార్థనా మందిరాలు ధ్వంసమయ్యాయి. 700 ఇళ్లను తగలబెట్టారు. 200కుపైగా గ్రామాలు అగ్నికి ఆహుతయ్యాయ'ని ప్రకటన పేర్కొంది.

ఒకవేళ ఎన్నికల ప్రక్రియలో నిమగ్నమైతే ప్రవర్తనా నియమావళికి కట్టుబడి ఆయుధాలను అప్పగించాల్సి వస్తుందని, అలా చేస్తే నిరాయుధులమవుతామని, మయితే వర్గీయుల దాడి నుంచి మా గ్రామాలు, పట్టణాలను కాపాడుకోలేమని కూడా కుకీలు పేర్కొన్నారు. కాగా, రాజ్యాంగం ప్రకారం తమ కోసం వేరుగా అధికార యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని కుకీ సంఘాలు డిమాండ్ చేశాయి. అయితే మిజోరం శరణార్థులుగా తొమ్మిది వేల మందికిపైగా అర్హులైన ఓటర్లు ఉండటంతో మణిపూర్‌లో జరిగే ఎన్నికల్లో ఓటు వేసేందుకు వారు వచ్చే పరిస్థితి లేకపోవడం గమనార్హం

చివరి శ్వాస వరకూ మీతోనే...

ఫిలిబిత్ ప్రజలకు వరుణ్ గాంధీ లేఖ

న్యూఢిల్లీ: సొంత పార్టీపైనే విమర్శలు చేసి వార్తల్లో నిలిచిన బీజేపీ ఎంపీ వరుణ్ గాంధీకి తాజా ఎన్నికల్లో టికెట్ దక్కలేదు. ఉత్తరప్రదేశ్‌లో ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న ఫిలిబిత్ స్థానంలో ఈసారి రాష్ట్ర మంత్రి జితిన్ ప్రసాదకు బీజేపీ టికెట్ కేటాయించింది. దీంతో వరుణ్‌గాంధీ భవిష్యత్తు కార్యాచరణపై ఆసక్తి రేగింది. ఆయన స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తారా లేదా కాంగ్రెస్‌లో చేరతారా అనే ఉత్కంఠ నెలకొంది. ఈ పరిణామాల వేళ తన నియోజకవర్గ ప్రజలకు ఆయన భావోద్వేగపూరితమైన లేఖ రాశారు. ఈ ప్రాంతంతో తన బంధం విడదీయరానిదని వరుణ్‌గాంధీ చెప్పారు. '1983లో మూడేళ్ల వయసులో మా అమ్మ వేలు పట్టుకొని ఈ ప్రాంతంలో అడుగుపెట్టడం ఇప్పటికీ నాకు గుర్తుంది. ఈ ప్రజలంతా నా కుటుంబమే. ఎంపీగా నా పదవీకాలం ముగిసినా... మీతో నా బంధం చివరిశ్వాస వరకు కొనసాగుతుంది.ఫిలిబిత్ ప్రజలకు సేవ చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నా. ఇక్కడి ప్రజల ఆశయాలు నెరవేర్చేందుకు నిరంతరం పనిచేస్తా. ఎంపీగా లేకపోయినా... ఒక కుమారుడిగా మీకు సేవ చేస్తా. మీకోసం మా ఇంటి తలుపులు తెరిచే ఉంటాయి. సామాన్యుల తరపున గళమెత్తేందుకే రాజకీయాల్లోకి వచ్చా. ఎట్టిపరిస్థితుల్లోనూ అది కొనసాగించేందుకు మీ ఆశీర్వాదం కావాలి' అని వరుణ్ కోరారు. కొంతకాలంగా బీజేపీ కేంద్ర, రాష్ట్ర నాయకత్వాల తీరుపై వరుణ్‌గాంధీ విమర్శలు చేస్తున్నారు. గతేడాది కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఆయన కేదార్‌నాథ్‌లో కలుసుకోవడం ఆసక్తికర చర్చకు దారితీసింది. బీజేపీకి దూరంగా ఉంటున్న ఆయన పార్టీ మారే అవకాశం ఉందంటూ వార్తలు వచ్చాయి. మరోవైపు, వరుణ్ తల్లి మేనకాగాంధీని యూపీలోని సుల్తాన్‌పూర్ నుంచి బీజేపీ మరోసారి బరిలోకి దించింది.

మణిపూర్‌లో తుపాకుల కలకలం.. నలుగురి అరెస్ట్

మణిపూర్: రాష్ట్రంలోని బిష్ణుపూర్ జిల్లాలో తుపాకీలు కలిగి ఉన్న నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి మూడు రైఫిల్స్‌తో పాటు ఏడు మొబైల్ ఫోన్‌లు, ఒక వాకీటాకీ సెట్, రెండు కార్లు స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు. అరెస్టయిన వారిలో సలాం రామేశ్వర్ సింగ్, టోంగ్‌బ్రామ్ గ్యాంజిత్ సింగ్ అలియాస్ చింగ్లెన్సనా, పుఖ్రేమ్ ఇంగోచా సింగ్, తోక్‌చోమ్ టెంబా అలియాస్ వఖీబా ఉన్నారని చెప్పారు. పుఖ్రేమ్, వఖీబా యునైటెడ్ నేషనల్ లిబరేషన్ ఫ్రంట్ లతో వీరికి సంబంధాలు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. వీరిపై కేసు నమోదు చేశామని తదుపరి విచారణ కొనసాగుతుందన్నారు. గత ఏడాది కాలంగా మణిపూర్‌లో హింసాత్మక ఘటనలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో ఈ అరెస్టులు జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది. మొదట్లో మెయిటీలు, కుకీల మధ్య జాతి వైరుధ్యంగా వివాదం మొదలైన విషయం తెలిసిందే.

బీజేపీపై పోరులో వామపక్షాలే కీలకం

- ఈసారి మెరుగైన ఫలితాలు సాధిస్తాం
- పీటీఐ ఇంటర్వ్యూలో సీతారాం ఏచూరి

న్యూఢిల్లీ: లోక్‌సభలో సంఖ్యాబలంతో సంబంధం లేకుండా బీజేపీపై పోరుకు అజెండా రూపొందించడంలో వామపక్షాలు ఎప్పుడూ అగ్ర భాగాన ఉన్నాయని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చెప్పారు. 370వ అధికరణ, సీఏఏ, వ్యవసాయ చట్టాలు, ఎన్నికల బాండ్లు వంటి అనేక అంశంపై బీజేపీకి వ్యతిరేకంగా పోరాటానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టంచేశారు. రాబోయే ఎన్నికల్లో తమ సీట్ల సంఖ్య మెరుగుపరుచుకోగలమని భావిస్తున్నామన్నారు. పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో సీతారం ఏచూరి అనేక అంశాలపై సవివరంగా తన అభిప్రాయాలు పంచుకున్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో బీజేపీ పాగా వేయడం అసాధ్యమని ఆయన స్పష్టంచేశారు. సీట్ల పరంగా ఈసారి ఎన్నికల్లో వామపక్షాలు కచ్చితంగా తమ బలాన్ని మెరుగుపరుచుకుంటాయని, ఎన్ని సీట్లు గెలుచుకుంటాయనేది ముఖ్యం కాదని, అజెండా రూపొందించడంలో ఎటువంటి పాత్ర పోషిస్తున్నాయన్నది కీలకమని ఏచూరి పేర్కొన్నారు. గత ఐదేళ్ల కాలాన్ని పరిశీలించినట్లైతే బీజేపీ తీసుకొచ్చిన విచ్ఛిన్నకరమైన లేదా రాజ్యాంగ విరుద్ధమైన ప్రతి అంశంపైనా వామపక్షాలు అజెండాను రూపొందిస్తూ వచ్చాయన్నారు. అదే సమయంలో ప్రజా పోరాటాలు నిర్వహించాయని తెలిపారు. అనేక సమస్యలపై వామపక్షాలు చేసిన పోరాటాలను ఉదహరించారు. 370వ అధికరణ రద్దును వ్యతిరేకించింది మొట్టమొదటగా వామపక్షాలేనని, వాస్తవానికి సుప్రీంకోర్టు అనుమతి, ఆదేశాలతో శ్రీనగర్‌ను మొట్టమొదట సందర్శించిన రాజకీయ నేత తానేనన్న విషయాన్ని ఏచూరి గుర్తు చేశారు. 370వ అధికరణ రద్దు తరువాత జమ్మూకశ్మీర్‌లో కర్ఫ్యూ విధించి, రాజకీయ నేతలను నిర్బంధించారని, ఆ సమయంలో తమ పార్టీ నాయకుడు యూసఫ్ తరిగామిని ఎక్కడ నిర్బంధించారో తెలుసుకోగోరుతూ కోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్‌ను తానే వేశానని ఏచూరి తెలిపారు. అస్వస్థతకు గురైన తరిగామిని చూసేందుకు శ్రీనగర్ వెళ్లేందుకు అనుమతి సాధించడం దగ్గర నుంచి...ఆయనకు మెరుగైన వైద్యం అందించడం కోసం దిల్లీలోని ఎయిమ్స్‌కు తీసుకొచ్చి, తిరిగి కశ్మీర్‌కు పంపేవరకు అవసరమైన అనుమతుల కోసం తాను పెద్ద పోరాటమే చేయాల్సి వచ్చిందన్నారు. పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ)పై దేశవ్యాప్తంగా చర్చ జరగడంలో, నిరసనలు తెలియచేయడంలో, సుప్రీంకోర్టులో సవాలు చేయడంలో అన్నింటా వామపక్షాలు అగ్రభాగాన ఉన్నాయని ఏచూరి చెప్పారు. ఎన్నికల బాండ్ల విషయంలోనూ పోరాటాలు చేశామన్నారు. బిల్కిస్ బానో కేసులో దోషులందరినీ విడుదల చేయడానికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టును ఆశ్రయించిన వారిలో సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు సుభాషిణి అలీ ఉన్నారని అన్నారు. తాము చేసిన పోరాటం ఫలితంగా ఎన్నికల బాండ్లను సుప్రీం రద్దు చేసిందని, విరాళాలకు సంబంధించిన డేటా బయటకొచ్చిందన్నారు. కార్పొరేట్ అనుకూల, రైతు వ్యతిరేక వైఖరి తీసుకున్న నరేంద్ర మోదీ ప్రభుత్వ మెడలు వంచేలా చేసింది చారిత్రక రైతాంగ పోరాటమొక్కటేనని, ఆ చట్టాలను చివరికి ప్రభుత్వం ఉపసంహరించుకోవాల్సి వచ్చిందని ఏచూరి చెప్పారు. నిరసనలకు నేతృత్వం వహించిన సంయుక్త కిసాన్ మోర్చాలో వామపక్షాలకు చెందిన అనేక రైతు సంఘాలు సభ్యులుగా ఉన్నాయన్నారు. ఈ ఎన్నికల అనంతరం వామపక్షాలు మరింత బలోపేతమవుతాయని, తమ పార్టీ సీట్ల సంఖ్యను మెరుగుపరుచుకుంటుందని చెప్పారు. వివిధ రాష్ట్రాల నుండి లోక్‌సభలో ప్రవేశిస్తామని, ఇంతకుముందు కన్నా ఎక్కువ రాష్ట్రాల నుండి గెలుస్తామని, గతంలో తమిళనాడు, కేరళల్లో గెలిచామని ఏచూరి చెప్పారు. దక్షిణాది రాష్ట్రాల్లో బీజేపీ పాగా వేసే అవకాశం ఉందా అన్న ప్రశ్నకు బదులిస్తూ మత విద్వేషాల ద్వారా ఉత్తరాది రాష్ట్రాల్లో భావోద్వేగాలను బీజేపీ రెచ్చగొట్టవచ్చని, కానీ దక్షిణాది రాష్ట్రాల్లో దాని కుట్రలు సాగవని స్పష్టంచేశారు.

238 సార్లు ఓటమి... మళ్లీ పోటీ

చెన్నై: తమిళనాడులోని మెట్టూరుకు చెందిన 65 ఏళ్ల కె.పద్మరాజన్ 1988 నుంచి ఎన్నికల్లో పోటీ చేస్తున్నాడు. ఇప్పటి వరకు 238 ఎన్నికల్లో పోటీ చేసిన ఆయన ఓటమిపాలయ్యాడు. అయినప్పటికీ తనకు గెలుపు ముఖ్యం కాదని, ఎన్నికల్లో పోటీ చేయడమే ప్రధానమని చెబుతాడు. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల్లో తమిళనాడులోని ధర్మపురి జిల్లా నుంచి పోటీకి సిద్ధమయ్యాడు. 'ఎలక్షన్ కింగ్'గా పేరుగాంచిన పద్మరాజన్... రాష్ట్రపతి నుంచి స్థానిక ఎన్నికల వరకు దేశవ్యాప్తంగా అన్ని ఎన్నికల్లో పోటీ చేస్తున్నాడు. ప్రధాని నరేంద్ర మోదీ, మాజీ ప్రధానులు అతల్ బిహారీ వాజ్‌పేయి, మన్మోహన్‌సింగ్, కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ వంటి రాజకీయ ఉద్దండులపై కూడా పోటీ చేసి ఓడిపోయాడు. అభ్యర్థులంతా ఎన్నికలలో విజయం సాధించాలని కోరుకుంటారని, తాను మాత్రం కాదని, ఎన్నికల్లో పోటీ చేయడమే తన విజయమని, ఓటమి పరంపరలో మళ్లీ ఓడిపోయినా సంతోషమేనని పద్మరాజన్ గర్వంగా చెబుతున్నాడు. మరోవైపు టైర్ రిపేర్ షాప్ నిర్వహించే పద్మరాజన్ హోమియోపతి మందుల అమ్మకంతోపాటు స్థానిక మీడియాకు ఎడిటర్‌గా పనిచేస్తున్నాడు. ఎన్నికల్లో నామినేషన్ కోసం ఇప్పటి వరకు లక్షలు చెల్లించిన ఆయన అన్నిసార్లు డిపాజిట్ కోల్పోయాడు. 2011లో మెట్టూరులో అసెంబ్లీ ఎన్నికలకు పోటీ చేసినప్పుడు తన ఓటు తప్ప ఎవరూ వేయరని అనుకున్న ఆయన అత్యధికంగా 6,273 ఓట్లు సాధించాడు. ఇప్పటి వరకు పోటీ చేసిన అన్ని ఎన్నికల్లో ఓడిపోయిన పద్మరాజన్... లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో మాత్రం విజయం సాధించాడు. అత్యంత ఓటమి అభ్యర్థిగా రికార్డుకెక్కాడు. తన ఊపిరి ఉన్నంత వరకు ఎన్నికల్లో పోటీ చేస్తూనే ఉంటానని చెప్పాడు. ఒకవేళ ఎప్పుడైనా తాను గెలిస్తే గుండెపోటుతో చనిపోతానేమోనని వ్యాఖ్యానించాడు.

సదానంద్ దాతెకు ఎన్ఐఏ పగ్గాలు

న్యూఢిల్లీ: మహారాష్ట్ర 'ఉగ్రవాద వ్యతిరేక దళం' అధిపతిగా ఉన్న సదానంద్ వసంత్ దాతెను 'జాతీయ దర్యాప్తు సంస్థ' (ఎన్ఐఏ) డైరెక్టర్ జనరల్‌గా నియమిస్తూ కేంద్ర హోంశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఈ పదవిలో ఉన్న దినకర్ గుప్తా ఈనెల 31న పదవీ విరమణ చేయనున్నారు. ఆయన స్థానంలో రాబోతున్న 1990 బ్యాచ్ ఐపీఎస్ అధికారి వసంత్...2026 డిసెంబరు 31 వరకు ఈ పదవిలో కొనసాగనున్నారు. 26/11 దాడిగా పేరొందిన ముంబై పేలుళ్ల (2008 నవంబరు 26) ఘటనలో కీలక ఉగ్రవాదులు అజ్మల్ కసబ్, అబు ఇస్మాయిల్‌లను అరెస్టు చేసింది వసంత్. అప్పుడు ఆయన ముంబై అదనపు పోలీసు కమిషనర్‌గా ఉన్నారు. ఉగ్రవాదులు విసిరిన గ్రనేడ్ పేలి... కాళ్లూచేతులకు తీవ్రగాయాలై, చాలారక్తం కోల్పోయి తాను స్పృహతప్పి పడిపోయేంతవరకు దాదాపు గంటసేపు వీరిద్దరినీ నాడు వదల్లేదు. గ్రనేడ్ తునకలు శరీరాన్ని చీల్చినా వెనక్కి తగ్గకుండా కాల్పులు జరుపుతూ... సీనియర్ అధికారులకు ముఖ్యమైన సమాచారం చెబుతూ ఎదురుదాడి పనిని సులభతరం చేశారు. ఆనాటి సాహసోపేత చర్యకుగానూ ఆయన రాష్ట్రపతి పోలీసు పతకాన్ని అందుకున్నారు. ఉగ్రదాడుల కేసుల దర్యాప్తు నిపుణుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. అధునాతన ఆయుధాలను అలవోకగా వినియోగించగలిగే సామర్థ్యం ఉన్న వసంత్ దాతె... మరాఠీలో ఓ పుస్తకం రాశారు. పేద కుటుంబానికి చెందిన ఆయన పుణెలో కొన్నాళ్లు దినపత్రికలు విక్రయించారు.

ఎన్‌డీఆర్ఎఫ్‌కు పీయూష్ ఆనంద్

'జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం' (ఎన్‌డీఆర్ఎఫ్) అధిపతి అతుల్ కర్వాల్ స్థానంలో పీయూష్ ఆనంద్‌ను కేంద్రం నియమించింది. ఆనంద్ ప్రస్తుతం సీఐఎస్ఎఫ్ ప్రత్యేక డీజీగా ఉన్నారు. 'బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్, డెవలప్‌మెంట్' డైరెక్టర్ జనరల్‌గా రాజస్థాన్ క్యాడర్‌కు చెందిన 1990 బ్యాచ్ ఐపీఎస్ రాజీవ్ కుమార్ శర్మ నియమితులయ్యారు. ఎస్పీజీ అదనపు డైరెక్టర్ జనరల్‌గా ఎస్.సురేశ్‌ను నియమించారు.

గోవాలో ఈడీ...ఆప్ నేతల విచారణ

పనాజీ: మనీలాండరింగ్ కేసుకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గురువారం ఆమ్ ఆద్మీ పార్టీ గోవా శాఖ అధ్యక్షుడు అమిత్ పాలేకర్‌తో పాటు మరో ముగ్గురిని ప్రశ్నించింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద నమోదైన కేసులో పాలేకర్, ఆప్ నేత రాంరావ్ వాఘ్‌తో పాటు మరో ఇద్దరు దత్తప్రసాద్ నాయక్, అశోక్ నాయక్‌లను ఈడీ విచారణకు పిలిచింది. ఈ కేసుకు సంబంధించిన వివరాలు ఇంకా తెలియనప్పటికీ, దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, మరికొందరు ఆప్ నేతలను అరెస్టు చేసిన ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కుంభకోణంతో ముడిపడి ఉన్న కేసులో వారిని ప్రశ్నించడానికి పిలిచినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. దత్తప్రసాద్, అశోక్... గోవాలోని భండారీ వర్గానికి చెందిన నాయకులు. పాలేకర్ మధ్యాహ్నం 12.10 గంటలకు ఇక్కడి ఈడీ కార్యాలయానికి చేరుకోగా, ఆయన కంటే ముందే మరో ముగ్గురు ఉదయం 11.15 గంటలకు అక్కడికి చేరుకున్నారు. ఏజెన్సీ కార్యాలయంలోకి అడుగుపెట్టే ముందు పాలేకర్ మాట్లాడుతూ 'నాకు సమన్లు వచ్చాయి. తిరిగి వచ్చిన తర్వాత మీ అందరితో మాట్లాడుతాను' అని మాత్రం చెప్పారు. మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో భోజన విరామం కోసం కార్యాలయం నుంచి బయటకు వచ్చిన తర్వాత పాలేకర్ మాట్లాడుతూ... "దర్యాప్తు ఏమిటనేది నేను వెల్లడించలేను. నేను విచారణలో ఉన్నా. వారు నన్ను ఏ ప్రశ్నలు అడిగినా, నేను సమాధానం ఇస్తున్నాను" అని చెప్పారు. కేసుకు సంబంధించిన డేటాను తీసుకురావాలని కోరినట్లు చెప్పారు.

కాంగ్రెస్ పిటిషన్లు తిరస్కరించిన దిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీకి దిల్లీ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. నాలుగేళ్లపాటు రీఅసెస్‌మెంట్ ప్రొసీడింగ్స్ ప్రారంభించాలన్న ఆదాయపు పన్ను శాఖ ఆదేశాలను సవాలు చేస్తూ కాంగ్రెస్ దాఖలు చేసిన పిటిషన్‌ను దిల్లీ హైకోర్టు కొట్టివేసింది. 2014-2017 మధ్య పన్నుల రీవాల్యుయేషన్‌పై కాంగ్రెస్ పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది. జస్టిస్ యశ్వంత్ వర్మ, జస్టిస్ పురుషేంద్ర కుమార్ కౌరవ్‌తో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్లను తిరస్కరించింది. 2014–15, 2015–16, 2016–17 అసెస్‌మెంట్ సంవత్సరాలకు సంబంధించి రీ–అసెస్‌మెంట్ ప్రొసీడింగ్‌లను సవాలు చేస్తూ కాంగ్రెస్ దాఖలు చేసిన పిటిషన్‌లను మార్చి 22న కోర్టు కొట్టివేసింది. ఐటీశాఖ తాజాగా పరిశీలన ప్రారంభించిన ఇతర అసెస్‌మెంట్ సంవత్సరాలకు సంబంధించిన తాజా నాలుగు పిటిషన్‌లను కోర్టు తిరస్కరించింది. ఈ కేసులో టాక్స్ అథారిటీ ఎలాంటి చట్టబద్ధమైన నిబంధనలను ఉల్లంఘించలేదని, పార్టీ ఆదాయం రూ.520 కోట్ల కంటే ఎక్కువగా ఉందని కోర్టు పేర్కొంది. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ ఖాతాలో ఉన్న రూ.105 కోట్లను ఐటీశాఖ ఫ్రీజ్ చేసిన విషయం తెలిసిందే. ఫ్రీజ్ చేసిన నిధులను విడుదల చేయాలంటూ కాంగ్రెస్ దాఖలు చేసిన పిటిషన్‌ను దిల్లీ హైకోర్టు కొట్టేవేసిన విషయం తెలిసిందే. అయితే, పార్టీ నుంచి రూ.65.94 కోట్ల మొత్తాన్ని రికవరీ చేయడంతో పాటు ఈ మధ్యకాలంలో జరిగిన పరిణామాలను దృష్టిలో ఉంచుకుని, ఐటీఏటీ ఎదుట స్టే కోసం దరఖాస్తు దాఖలు చేసేందుకు కాంగ్రెస్‌కు అనుమతి ఇచ్చింది.

పదేళ్లలో ఏం చేశారు?

మోదీ సర్కారుకు ప్రశ్నలు సంధించిన ప్రియాంక

న్యూఢిల్లీ: కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి ప్రియాంకాగాంధీ కేంద్రంలోని మోదీ సర్కారుపై ధ్వజమెత్తారు. లోక్‌సభ ఎన్నికల కోసం చేపట్టిన 'మేరే వికాస్ కా దో హిసాబ్' మీడియా ప్రచారంలో భాగంగా కేంద్రప్రభుత్వంపై సూటిగా ప్రశ్నలు సంధించారు. నిరుద్యోగం, ధరల పెరుగుదల, రైతుల దుస్థితి వంటి సమస్యలపై పదేళ్లలో ఏంచేశారని నిలదీశారు. పదేళ్ల బీజేపీ పాలనా కాలంలో జరిగిన అభివృద్ధిని వివరించాలని డిమాండ్ చేశారు. 'దేశంలో మొత్తం నిరుద్యోగుల్లో 83 శాతం మంది యువత ఎందుకు ఉన్నారు? ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఎక్కడ ఉన్నాయి? దేశంలో 30 లక్షల ప్రభుత్వ పోస్టులు ఎందుకు ఖాళీగా ఉన్నాయి? ప్రతి పరీక్ష పేపర్ ఎందుకు లీక్ అవుతోంది?' అంటూ ప్రియాంక విరుచుకుపడ్డారు. ఒకపక్క కార్పొరేట్లకు రూ.16 లక్షల కోట్ల రుణమాఫీ చేశారని, మరో పక్క అప్పుల బాధతో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్న పరిస్థితి కనబడుతోందని ఆమె అన్నారు.

'మీరు ఇచ్చిన హామీ మేరకు రైతుల ఆదాయం ఎప్పుడు రెట్టింపు అవుతుంది? రైతులకు ఎంఎస్‌పీ ఎప్పుడు లభిస్తుంది?' అని ప్రియాంక ప్రశ్నించారు. దేశంలో దళితులు, వెనుకబడిన తరగతులు, గిరిజనులు, మైనారిటీలు, పేద అగ్రవర్ణాలకు ఎక్కడా సరైన ప్రాతినిధ్యం లేదని విమర్శించారు. 'ఈ రోజు ద్రవ్యోల్బణం ఎందుకు గరిష్ఠస్థాయికి చేరుకుంది? సామాన్యులకు ఇల్లు గడుపుకోవడం ఎందుకు కష్టమవుతోంది?' అని ప్రియాంకాగాంధీ అన్నారు. దేశంలో మహిళలపై అఘాయిత్యాలు ఎందుకు పెరుగుతున్నాయని ఆమె ప్రశ్నించారు.

టికెట్ రాలేదని ఆత్మహత్యాయత్నం

చికిత్స పొందుతూ ఎంపీ కన్నుమూత

కోయంబత్తూర్: లోక్‌సభ ఎన్నికల ముందు తమిళనాడులో విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఈరోడ్ ఎంపీ, ఎండీఎంకే నేత గణేశ్‌మూర్తి (77) కన్నుమూశారు. ఎన్నికల్లో టికెట్ దక్కకపోవడంతో ఇటీవల ఆయన ఆత్మహత్యకు యత్నించారు. కోయంబత్తూర్‌లోని ఓ ఆసుపత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ గురువారం ఉదయం తుదిశ్వాస విడిచారు. 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో డీఎంకే కూటమిలో ఎండీఎంకేకు ఈరోడ్ స్థానం దక్కింది. అక్కడి నుంచి గణేశ్‌మూర్తి ఉదయించే సూర్యుడు(డీఎంకే) గుర్తుపైనే పోటీ చేసి విజయం సాధించారు. అయితే, ప్రస్తుత ఎన్నికల్లో కూటమి సర్దుబాట్లలో భాగంగా ఎండీఎంకేకు తిరుచ్చి కేటాయించగా... అక్కడి నుంచి దురైవైగోను పార్టీ తమ అభ్యర్థిగా ప్రకటించింది. దీంతో గణేశ్‌మూర్తి తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. మార్చి 24న ఆయన అస్వస్థతకు గురవడంతో ఆసుపత్రిలో చేర్చారు. విషపూరిత ట్యాబ్లెట్లు మింగి ఎంపీ ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆ తర్వాత పార్టీ వర్గాలు వెల్లడించాయి. నాలుగు రోజులుగా చికిత్స పొందుతున్న ఆయన... ఈ ఉదయం పరిస్థితి విషమించడంతో కన్నుమూసినట్లు పోలీసులు వెల్లడించారు. ఆత్మహత్యగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. 1947 జూన్‌లో జన్మించిన గణేశ్‌మూర్తి...1993లో ఎండీఎంకే ప్రారంభమైనప్పటి నుంచి ఇదే పార్టీలో ఉన్నారు. 1998లో తొలిసారిగా పళని లోక్‌సభ స్థానం నుంచి గెలుపొందారు. ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి శాసనసభ సభ్యుడిగా వ్యవహరించిన ఆయన... 2009లో ఈరోడ్ నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు. 2014లో ఓటమి పాలై, గత ఎన్నికల్లో ఇదే స్థానం నుంచి రెండు లక్షల భారీ మెజార్టీతో మరోసారి విజయం సాధించారు. 2016లో పార్టీ కోశాధికారిగా బాధ్యతలు చేపట్టారు.

కాంగ్రెస్‌కు సావిత్రి జిందాల్ రాజీనామా

చండీగఢ్: కాంగ్రెస్ పార్టీకి హర్యానా మాజీ మంత్రి సావిత్రి జిందాల్ రాజీనామా చేశారు. ఈ విషయాన్ని ఆమె సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. హిస్సార్ ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తూ... దశాబ్దకాలం ప్రజలకు సేవా చేశానని ఆమె తెలిపారు. హిస్సార్ నియోజకవర్గ ప్రజలు తన కుటుంబ సభ్యులని చెప్పారు. నా కుటుంబ సభ్యుల సలహా మేరకు కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు సావిత్రి జిందాల్ ప్రకటించారు. భుపేంద్ర సింగ్ హుడా కేబినెట్‌లో సావిత్రి జిందాల్ మంత్రిగా పని చేశారు. ఇక బీజేపీ అభ్యర్థి డాక్టర్ కమల్ గుప్తా చేతిలో ఓటమి పాలయ్యారు. ప్రస్తుతం ఆయన నయాబ్ సింగ్ సైనీ కేబినెట్‌లో మంత్రిగా కొనసాగుతున్నారు. ఫోర్బ్స్ ఇండియా ఈ ఏడాది ప్రకటించిన దేశంలో 10 మంది అత్యంత సంపన్న మహిళల్లో సావిత్రి జిందాల్ చోటు సంపాదించారు. సావిత్రి జిందాల్ మొత్తం ఆస్తి విలువ రూ. 2.42 లక్షల కోట్లు ఉంటుందని అంచనా. ప్రముఖ పారిశ్రామికవేత్త, మాజీ మంత్రి ఓపీ జిందాల్ భార్యే సావిత్రి జిందాల్. వీరి కుమారుడు, ప్రముఖ పారిశ్రామిక వేత్త నవీన్ జిందాలు... గత ఆదివారం కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరారు. ప్రధాని నరేంద్ర మోదీ చేపట్టిన వికసిత భారత్‌లో తన వంతుగా సహకరిస్తానని ఆయన ప్రకటించిన విషయం విధితమే. నవీన్ జిందాల్‌కు కురుక్షేత్ర లోక్‌సభ అభ్యర్థిగా బీజేపీ అగ్రనాయకత్వం ప్రకటించింది. దాంతో ప్రస్తుతం ఆయన కురుక్షేత్రలో ఎన్నికల ప్రచారంలో దూసుకు పోతున్నారు.

నానక్‌మట్టా సాహిబ్ గురుద్వారా అధినేత హత్య

ఉత్తరాఖండ్: పట్టపగలే దుండగులు రెచ్చిపోయారు. ఉత్తరాఖండ్‌లోని ఉదమ్ సింగ్ నగర్‌లోని నానక్‌మట్టా సాహిబ్ గురుద్వారా అధినేత బాబా తర్సేమ్ సింగ్‌ను గురువారం తెల్లవారుజామున బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు గురుద్వారా ఆవరణలో కాల్చి చంపారు. దీనికి సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు బయటకు వచ్చాయి. ఉదయం 6.30 గంటల సమయంలో గురుద్వారా ప్రాంగణంలో కుర్చీపై బాబా తర్సేమ్ సింగ్ కూర్చుని ఉండగా బైక్‌పై వచ్చిన దుండగులు అతడిపై కాల్పులు జరిపారు. ముసుగులు ధరించిన ఇద్దరు దుండగులు నానక్‌మట్టా గురుద్వారాలోకి ప్రవేశించి కర్ సేవా ప్రముఖ్ బాబా తర్సేమ్ సింగ్‌ను కాల్చిచంపారు. ఈ ఆలయం ధమ్ సింగ్ నగర్ జిల్లాలో రుద్రపూర్–తనక్‌పూర్ మార్గంలోని సిక్కుల పుణ్యక్షేత్రంగా ఉంది. బాబా తర్సేమ్ సింగ్‌ను ఖతిమాలోని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించారని ఉధమ్ సింగ్ నగర్ ఎస్పి మంజు నాథ్ తెలిపారు. హత్యపై దర్యాప్తు చేసేందుకు పోలీసులు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేశారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఉధమ్‌సింగ్‌నగర్ జిల్లాలోని నానక్‌మట్టా ప్రాంతంలో అదనపు పోలీసు సిబ్బందిని మోహరించామని, శాంతిభద్రతలను కాపాడేందుకు సహకరించాలని సిక్కు సమాజానికి పోలీసులు విజ్ఞప్తి చేశారు. త్వరలోనే నిందితులను అదుపులోకి తీసుకుంటామన్నారు. ఉదయం ఏడు గంటలకు తమకు సమాచారం అందిందని ఉదయం సుమారు 6.30 గంటల సమయంలో ఇద్దరు ముసుగు ధరించిన దుండగులు నానక్‌మట్టా గురుద్వారాలోకి ప్రవేశించి కాల్పులకు పాల్పడ్డారన్నారు.

నీటి సంక్షోభంలో 30 నగరాలు

- విశాఖ, హైదరాబాద్‌కూ ముప్పు
- నిపుణుల హెచ్చరిక

న్యూఢిల్లీ:
దేశంలో దాదాపు 30 నగరాలు నీటి సమస్యను ఎదుర్కొనే ప్రమాదం కనిపిస్తోంది. కర్నాటక రాజధాని బెంగళూరు నగరం నీటి సమస్యతో అల్లాడిపోతుండటం దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. నీరు లేక బెంగళూరు నగరం పడుతున్న అవస్థలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సిలికాన్ వ్యాలీ ఆఫ్ ఇండియాగా పిలిచే బెంగళూరులో... దేశవ్యాప్తంగా ఐటీ ఉద్యోగులు పనిచేస్తున్నారు. ప్రస్తుతం అక్కడ నీటి సమస్య తలెత్తడంతో 'వర్క్ ఫ్రమ్ హోం' చేస్తూ సొంత ఊర్లకు పయనమవుతున్నారు. బెంగళూరును విడిచివెళ్లేవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. అయితే ఈ నీటి సంక్షోభం బెంగళూరు నగరంలోనే కాకుండా హైదరాబాద్ సహా దేశంలో మరో 30 నగరాలకు కూడా విస్తరించే అవకాశం ఉందనే వాదనలు వినిపిస్తున్నాయి. బెంగళూరు నగరానికి ప్రధాన నీటి వనరులైన భూగర్భ జలాలు, కావేరీ నదిలో నీరు అడుగంటిపోవడంతో నీటి సమస్య తలెత్తింది. దీంతో బెంగళూరులో వేలాది బోర్లు ఎండిపోయాయి. నీరు దొరక్క జనం ఇబ్బందులు పడుతున్నారు. నీటిని పొదుపు చేయాలని అధికారులు, ప్రభుత్వం, హౌసింగ్ సొసైటీలు నగరవాసులకు సూచనలు చేస్తున్నాయి. తాగు నీటిని వృథా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ఇలా నీటిని వృథా చేసిన 22 కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.5000 చొప్పున రూ.1.1 లక్షల జరిమానాను అధికారులు వసూలు చేశారు. రుతుపవనాలు వచ్చి వర్షాలు పడేవరకు ఈ నీటి సమస్య కొనసాగుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. బెంగళూరులో ఏర్పడిన నీటి సమస్యను చూసి దేశవ్యాప్తంగా తీవ్ర భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి పరిస్థితి తమకు కూడా వస్తే ఎలా అని ప్రజలు భయపడుతున్నారు. ప్రస్తుతం ఈ సమస్య బెంగళూరులో ఉంది. రాబోయే కాలంలో హైదరాబాద్‌తోపాటు దేశంలోని మరో 30 నగరాలు నీటి సంక్షోభాన్ని ఎదుర్కొనే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. 2030 నాటికి భారత దేశ జనాభాలో 40 శాతం మందికి తాగునీరు దొరకదని 2019 లోనే నీతిఆయోగ్ ఒక నివేదికలో వెల్లడించింది. దేశంలోని ప్రధాన నగరాలైన బెంగళూరు, ముంబై, ఢిల్లీ, హైదరాబాద్, జైపూర్, భటిండా, లక్నో, చెన్నై సహా కొన్ని నగరాలు తీవ్ర నీటి సమస్యను ఎదుర్కొనే అవకాశం ఉందని తెలిపింది. 2050 నాటికి దేశంలోని 30 నగరాలు నీటి సంక్షోభాన్ని ఎదుర్కొంటాయని వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్ 2020 నివేదిక పేర్కొంది. ఇందులో ఢిల్లీ, జైపూర్, ఇండోర్, అమృత్‌సర్, పుణె, శ్రీనగర్, కోల్‌కతా, బెంగళూరు, ముంబై, కోజికోడ్, వైజాగ్ ఉంటాయని వెల్లడించింది. 2023 ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం భారతదేశంలోని సింధు-గంగా పరివాహక ప్రాంతంలోని కొన్ని ప్రాంతాలు ఇప్పటికే భూగర్భ జలాల క్షీణతను ఎదుర్కొంటున్నాయని తెలిపింది. వాయువ్య ప్రాంతంలో 2025 నాటికి భూగర్భ జలాల లభ్యత తగ్గుతుందని చెప్పింది.

రెండో దశ పోలింగ్‌కు ఈసీ నోటిఫికేషన్

న్యూఢిల్లీ:
లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి రెండో దశలో పోలింగ్ జరిగే రాష్ట్రాల్లో నామినేషన్ల స్వీకరణ గురువారం నుంచి ప్రారంభమైంది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. 12 రాష్ట్రాల్లోని 88 లోక్‌సభ స్థానాల్లో ఏప్రిల్ 26న రెండోదశ పోలింగ్ జరుగుతుందని ఈసీ పేర్కొంది. రెండో దశలో అసోం, బీహార్, చత్తీస్‌గఢ్, జమ్మూకశ్మీర్, కర్నాటక, కేరళ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్థాన్, త్రిపుర, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్నాయి. నోటిఫికేషన్ జారీతో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. ఏప్రిల్ నాలుగో తేదీ వరకు నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ. నామినేషన్ల పరిశీలన అన్ని రాష్ట్రాల్లో ఏప్రిల్ ఐదో తేదీన జరగనుండగా, జమ్మూకశ్మీర్‌లో ఏప్రిల్ ఆరో తేదీన జరుగుతుంది. అభ్యర్థులు నామినేషన్లు ఉపసంహరించేందుకు చివరి తేదీ ఏప్రిల్ 8. ఇక ఏప్రిల్ 26వ తేదీన పోలింగ్ జరగనుంది. జూన్ నాలుగో తేదీన ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. ఇక రెండో దశలోనే హింసాకాండతో అట్టుడుకుతున్న మణిపూర్‌లోని ఔటర్ మణిపూర్ స్థానంలో ఎన్నికలు జరగనున్నాయి. ఇన్నర్ మణిపూర్ లోక్‌సభ స్థానానికి సంబంధించి ఎన్నికలు మొదటి దశలోనే పూర్తవుతాయి. ఏప్రిల్ 19న ఇన్నర్ మణిపూర్‌లో ఎన్నికలు జరగనున్నాయి. రెండో దశలోనే బెంగాల్‌లో ఎన్నికలు జరుగుతాయి. దీంతో, అందరి దృష్టి బెంగాల్ రాజకీయాలపైనే ఉంది. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బెంగాల్‌లో అధికార టీఎంసీ, బీజేపీ నేతల మధ్య ఉద్రిక్త వాతావరణ చోటుచేసుకున్న విషయం తెలిసిందే.

'ఉపాధి హామీ' వేతనం పెంపు

తెలుగు రాష్ట్రాల్లో రూ.28 పెంపుతో రూ.300లకు చేరిన కూలిరేటు

న్యూఢిల్లీ:
ఎన్నో రోజులుగా ఎదురు చూస్తున్న ఉపాధి హామీ కార్మికుల వేతనాలు పెరిగాయి. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు వివిధ రాష్ట్రాల్లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 4 నుంచి 10 శాతం వరకు కార్మికుల వేతనాలు పెరిగాయి. సవరించిన రేట్ల ప్రకారం ఈ పథకం కింద నైపుణ్యం లేని కార్మికులకు హర్యానాలో అత్యధిక వేతనం రోజుకు రూ.374 అందనుండగా, అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్ లలో అత్యల్పంగా రూ.234 వేతనం అందనుంది. సిక్కింలోని మూడు పంచాయితీలు గ్నాతంగ్, లాచుంగ్, లాచెన్ ప్రజలు రోజుకు సగటు వేతనం రూ. 374 వేతనం పొందనున్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున ఎన్నికల సంఘం నుంచి క్లియరెన్స్ వచ్చిన తర్వాత ఈ పథకం కింద వేతన సవరణను మార్చి 27న కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ నోటిఫై చేసింది. నైపుణ్యం లేని కార్మికులు వారు నివసిస్తున్న గ్రామంలో ప్రతి కుటుంబానికి ఆర్థిక సంవత్సరంలో కనీసం 100 రోజుల వేతన ఉపాధిని కల్పించడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని కుటుంబాల జీవనోపాధి భద్రతను పెంపొందించడమే ఈ పథకం లక్ష్యం. నోటిఫికేషన్ ప్రకారం.. గోవాలో వేతన పెంపు రేటు దేశంలోనే అత్యధికంగా రూ.34గా ఉంది. ప్రస్తుతం అక్కడ రోజువారీ కూలీ రూ.356 ఇస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వేతన పెంపు రూ.28గా ఉంది. ఇప్పుడు మొత్తం కూలీ రూ.300కి చేరింది. ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో పెరుగుదల అత్యల్పంగా రూ.7గా ఉంది. రెండు రాష్ట్రాలలో పని చేసే కార్మికులు రోజుకు రూ.237 వేతనం అందుకోనున్నారు. తెలంగాణలో రూ.28 పెంచడంతో రోజువారీ కూలీ రూ.300కి చేరింది. పశ్చిమ బెంగాల్‌లో రూ.250 (రూ.13 పెరుగుదల), తమిళనాడులో రూ.319 (రూ.25 పెరుగుదల), బీహార్‌లో రూ.228 (రూ.17 పెరుగుదల)గా ఉంది. వేతన రేటు పరంగా హర్యానా అగ్రస్థానంలో ఉన్నప్పటికీ, పెరుగుదల కేవలం నాలుగు శాతంగానే ఉంది. మొత్తంమీద పెంపుదల 4 నుంచి 10 శాతం మధ్య ఉంది. తెలంగాణ, ఏపీ, గోవా, కర్ణాటక రాష్ట్రాల్లో దాదాపు 10 శాతం పెరుగుదల నమోదైందని నోటిఫికేషన్ డేటా వెల్లడిస్తోంది.

కంటితుడుపు చర్యే: కాంగ్రెస్

'ఇండియా' అధికారంలోకి వస్తే రూ.400 చేస్తాం: రాహుల్



న్యూఢిల్లీ:
కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు పెంచిన ఉపాధిహామీ పథకం రోజువారీ కూలి రేట్లు పెంచడాన్ని కాంగ్రెస్ పార్టీ కంటి తుడుపు చర్యగా అభివర్ణించింది. కాంగ్రెస్ పార్టీ 'శ్రామిక్ న్యాయ్'లో రోజువారీ కూలి రేటు (రూ.400) కంటే ఇదే ఎంతో తక్కువని పేర్కొంది. 2024-25 సంవత్సరానికి సవరించిన ఉపాధిహామీ పథకం వేతనాలను నోటిఫై చేసిన తర్వాత ఈ మేరకు ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ గురువారం 'ఎక్స్' ద్వారా స్పందించారు. "ఉపాధి హామీ పథకం కార్మికులకు అభినందనలు! ప్రధాని మీ జీతం రూ.7 పెంచారు. ఇప్పుడు అతను మిమ్మల్ని అడగవచ్చు... అంత పెద్ద మొత్తంలో మీరు ఏమి చేస్తారని? అలాగే రూ. 700 కోట్లు ఖర్చు చేయడం ద్వారా వారు మీ పేరు మీద 'ధన్యవాదాలు మోదీ' అనే ప్రచారాన్ని కూడా ప్రారంభించవచ్చు" అని ఎద్దేవా రాహుల్ ఎద్దేవా చేశారు. ఇండియా కూటమి అధికారంలోకి వచ్చిన మొదటి రోజునే ప్రతి కూలీకి ఉపాధి హామీ పథకం కింద రోజువారీ కూలిరేటు రూ.400 చేయబోతోందని స్పష్టం చేశారు. కాగా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ 'ఎక్స్' ద్వారా స్పందిస్తూ... '2024/25 కోసం మోదీ ప్రభుత్వం సవరించిన ఉపాధి హామీ వేతనాలను ప్రకటించింది. రాబోయే ఎన్నికల దృష్ట్యా ఇది ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘిస్తుందా అనే విషయాన్ని పక్కన పెడితే... కాంగ్రెస్ 'శ్రామిక్ న్యాయం' హామీలలో భాగంగా ప్రకటించిన రోజువారీ కూలి రేటు రూ.400 కంటే తక్కువగా ఉంది' అని ఆయన అన్నారు. 'శ్రామిక్ న్యాయ్' హామీలలో భాగంగా మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను సమగ్రంగా సమీక్షిస్తామని... కార్మిక హక్కులను బలోపేతం చేయడానికి తగిన సవరణలు కూడా చేపడతామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది.

అదానీ కంపెనీలో రిలయన్స్‌కు వాటా

తొలిసారి చేతులు కలిపిన దిగ్గజాలు

న్యూఢిల్లీ:
ఇద్దరూ ప్రముఖ వ్యాపార వేత్తలు. దేశంలో అత్యంత ధనవంతులు. పైగా గుజరాత్ నుంచి వచ్చిన వారే. వ్యాపార దిగ్గజాలైన అంబానీ, అదానీ గురించి చెప్పాలంటే బహుశా రోజులు పట్టవచ్చేమో! వీరిద్దరూ ఎన్నో ఏళ్లుగా వ్యాపారాలు చేస్తున్నా ఎవరి వ్యాపారాలు వారివి. ఎవరి వ్యూహాలు వారివి. అలాంటి వారు తొలిసారి చేతులు కలిపారు. అదానీకి చెందిన ఓ పవర్ ప్రాజెక్ట్‌లో రిలయన్స్ తాజాగా 26 శాతం వాటా కొనుగోలు చేసింది. తద్వారా కుబేరుల మధ్య తొలిసారి వ్యాపార భాగస్వామ్యం నెలకొంది. అదానీ పవర్ లిమిటెడ్‌కు చెందిన మధ్యప్రదేశ్‌లోని మహాన్ ఎనర్జెన్ లిమిటెడ్‌లో రిలయన్స్ ఐదు కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను కొనుగోలు చేసింది. 500 మెగావాట్ల విద్యుత్‌ను తమ సొంత అవసరాలకు (క్యాప్టివ్) వినియోగించుకోనుంది. ఈ విషయాన్ని ఇరు సంస్థలూ వేర్వేరు స్టాక్ ఎక్స్ఛేంజీ ఫైలింగ్‌లో పేర్కొన్నాయి. 20 ఏళ్లకు రిలయన్స్‌తో పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ కుదురినట్లు అదానీ పవర్ తన ఫైలింగ్‌లో పేర్కొంది. 2,800 మెగావాట్ల విద్యుత్ సామర్థ్యం కలిగిన పవర్ ప్లాంట్‌లో 600 మెగావాట్ల సామర్థ్యం కలిగిన యూనిట్‌ను క్యాప్టివ్ యూనిట్ కోసం కేటాయించినట్లు తెలిపింది. ఇవే వివరాలను రిలయన్స్ సైతం తన ఫైలింగ్‌లో వెల్లడించింది. సాధారణంగా క్యాప్టివ్ జనరేటింగ్ ప్లాంట్ నుంచి సొంత అవసరాలకు విద్యుత్‌ను వినియోగించాలంటే ఆ కంపెనీలో 26 శాతం వాటా ఉండాలని నిబంధనలు చెబుతున్నాయి. ఈ పవర్‌ను దేనికోసం రిలయన్స్ వినియోగించబోయేదీ స్పష్టత లేదు. ఇప్పటికే గుజరాత్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లో రిలయన్స్‌కు క్యాప్టివ్ యూనిట్లు ఉన్నాయి.

టాప్ కోసం పోటీ...
ముకేశ్ అంబానీ, గౌతమ్ అదానీ వేర్వేరు వ్యాపారాల్లో ఉన్నారు. అంబానీ... ఆయిల్, గ్యాస్, రిటైల్, టెలికాం విభాగాలపై దృష్టి సారించగా, అదానీ... ఇన్‌ఫ్రా, పోర్టులు, ఎయిర్‌పోర్టులు, మైనింగ్ కార్యకలాపాల్లో నిమగ్నమై ఉన్నారు. పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల విషయంలో మాత్రం ఇరు సంస్థలూ పోటీ పడుతున్నాయి. ఇప్పటికే రెండు సంస్థలు పెద్ద ఎత్తున పెట్టుబడులు ప్రకటించాయి. 5జీ స్పెక్ట్రమ్ విషయంలోనూ ఇరు సంస్థలు పోటీ పడ్డాయి. అదానీ కంపెనీ ప్రజావసరాల కోసం వినియోగించే స్పెక్ట్రమ్ జోలికెళ్లలేదు. ఇక ఎన్డీటీవీని టేకోవర్ చేయడం ద్వారా అదానీ గ్రూప్ మీడియా రంగంలోకీ ప్రవేశించింది. తద్వారా మీడియా రంగంలోనూ ఇరువురి మధ్య పోటీ నెలకొంది. ఆసియాలోనే సంపన్నుల జాబితాలో నంబర్ వన్ స్థానం కోసం వీరిద్దరూ పోటీ పడుతున్న వేళ ఈ కొనుగోలు జరగడం గమనార్హం.

కనిమొళి ఆస్తులు రూ.57.32 కోట్లు

ఐదేళ్లలో 80 శాతం పెరుగుదల

చెన్నై:
తూత్తుకుడి లోక్‌సభ నియోజకవర్గంలో రెండోసారి పోటీ చేస్తున్న డీఎంకే మహిళా విభాగం నాయకురాలు కనిమొళి ఆస్తులు గత ఐదేళ్లలో 80 శాతం పెరిగాయి. నామినేషన్‌తోపాటు సమర్పించిన ఆస్తుల జాబితా వివరాల ప్రకారం ఆమె రూ. 57.32 కోట్ల మేరకు ఆస్తులు కలిగి ఉన్నారు. 2019లో నామినేషన్‌తో పాటు దాఖలు చేసిన ఆస్తుల జాబితా ప్రకారం అప్పట్లో ఆమెకు రూ.30.34 కోట్ల మేరకు ఆస్తులు ఉండేవి. తాజా వివరాల ప్రకారం కనిమొళి రూ.1,37,16,290 విలువైన మూడు కార్లు కలిగి ఉన్నారు. 704 గ్రాముల బంగారు, 13.03 కేరట్ వజ్రం తదితర విలువైన ఆభరణాలు ఉన్నాయి. ఆమె వద్ద నున్న నగల మొత్తం విలువ రూ.55.37 లక్షలు. ఇక నగదు, బ్యాంకు ఖాతాలో డిపాజిట్ చేసిన నగదు మొత్తం రూ.18.54 కోట్ల మేరకు స్థిరాస్తులు కలిగి ఉన్నాయి. కనిమొళి భర్త అరవిందన్ పేరిట నగదు, కారు అంటూ రూ.66.21 లక్షల విలువైన చరాస్తులు ఉన్నాయి. ఇక స్థలాలు వాణిజ్యభవనం, నివాసగృహం... రూ.2.26 కోట్ల విలువైన స్థిరాస్తులు ఉన్నాయి. రూ.60లక్షల 60వేలకు పైగా రుణం పొంది ఉన్నానని, భర్త పేరిట ఎలాంటి రుణాలు లేవని ఎన్నికల అఫిడవిట్‌లో కనిమొళి పేర్కొన్నారు.

అవసరమైతే 'అగ్నిపథ్'లో మార్పులు

రాజ్‌నాథ్ సింగ్

న్యూఢిల్లీ:
ప్రస్తుతం అమలవుతున్న అగ్నిపథ్ లేదా అగ్నివీర్ నియామక పథకంలో అవసరమైతే మార్పులు చేసేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. గురువారం ఆయన ఓ జాతీయ టీవీ ఛానల్ నిర్వహించిన సదస్సులో మాట్లాడారు. అగ్నివీరుల భవిష్యత్తులను సురక్షితంగా ఉంచేలా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి హామీ ఇచ్చారు. రక్షణ దళాల్లో యువతరం ప్రాధాన్యాన్ని వివరించిన మంత్రి అగ్నివీర్ పథకాన్ని మరోమారు సమర్థించారు. సైన్యంలో యువత ఉండాలని అన్నారు. 'దీని పట్ల ప్రస్తుత యువతరం ఉత్సాహంగా ఉందని నేను భావిస్తున్నా. వీరంతా అధునాతన సాంకేతిక పరిజ్ఞానం కలిగినవారని నమ్ముతున్నా. ఈ పథకం (అగ్నివీర్)లో భాగంగా వీరి భవిష్యత్తులను సురక్షితంగా ఉంచేందుకు మేము అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నాం. అవసరమైతే మరిన్ని మార్పులు చేసేందుకు కూడా కట్టుబడి ఉన్నాం' అని రాజ్‌నాథ్ స్పష్టం చేశారు. 'ఆత్మనిర్భర్ భారత్' అంశంపై మాట్లాడుతూ... ఇంజిన్‌లను ఎగుమతి చేసే దేశంగా భారత్‌ను తీర్చిదిద్దాలని చూస్తున్నామని అన్నారు. 'దేశాన్ని ఇంజిన్‌లను ఎగుమతి చేసే దేశంగా మార్చాలనుకుంటున్నాము. ఇందుకోసం భారత్‌లో ఎలాంటి ఇంజిన్‌లను తయారు చేయవచ్చో, ఇందుకు కావాల్సిన సాంకేతికతను పంచుకోవడానికి ఏ దేశాలు సిద్ధంగా ఉన్నాయో పరిశీలించమని నేను డీఆర్‌డీఓను కోరాను. ఈ ఇంజిన్‌లన్నీ భారతీయుల ద్వారానే తయారు చేయిస్తాం' అని చెప్పారు. అలాగే భారత్ భూభాగాన్ని చైనా ఆక్రమించుకుందన్న ప్రతిపక్షాల విమర్శలపై మంత్రి స్పందించారు. మన దేశ సరిహద్దులను ఎవరూ ఆక్రమించుకోలేదని, అవి పూర్తి సురక్షితంగా ఉన్నాయని పేర్కొన్నారు. సాయుధ బలగాలపై దేశ ప్రజలకు పూర్తి విశ్వాసం ఉందన్నారు.

కాంగ్రెస్ కంచుకోటలో అసమ్మతి సెగలు

కోలార్ అభ్యర్థి ఎంపికపై నేతల్లో భిన్నస్వరాలు

న్యూఢిల్లీ:
కాంగ్రెస్‌కు పెట్టని కోట లాంటి కర్నాటకలోని కోలార్ లోక్‌సభ నియోజకవర్గంలో అసమ్మతి నేతల ధిక్కార స్వరంతో అక్కడి పరిస్థితులు ఒక్కసారిగా వేడెక్కాయి. దీంతో అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నదానిపై ఉత్కంఠ నెలకొంది. కోలార్ లోక్‌సభ స్థానం ఎస్సీ కేటగిరీకి చెందినది. 1952 నుంచి ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థిదే విజయం. 1991 నుంచి ఇక్కడ ప్రాతినిధ్యం వహిస్తున్న కేహెచ్ మునియప్ప ఏడుసార్లు ఎంపీగా విజయం సాధించారు. గత సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి పాలవ్వడంతో రాష్ట్ర రాజకీ యాల్లోకి అడుగుపెట్టి.. ప్రస్తుతం సిద్ధరామయ్య సర్కారులో పౌరసరఫరాల శాఖ మంత్రిగా ఉన్నారు. తన మేనల్లుడు చిక్క పెద్దన్నకు ఈ టికెట్ ఇప్పించేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. దీనిపై పార్టీలో అంతర్గత విభేదాలు తలెత్తాయి. అదే జరిగితే పార్టీకి రాజీనామా చేస్తామని సీనియర్ నేతలు హెచ్చరిస్తుండటంతో పార్టీ అధిష్ఠానం ఓ నిర్ణయానికి రాలేకపోతోంది. కోలార్ జిల్లాకు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు, ఒక మంత్రి, ఇద్దరు ఎమ్మెల్సీలు పెద్దన్నకు టికెట్ అంశాన్ని తప్పుబడుతున్నారు. అధిష్ఠానం నుంచి వ్యతిరేక నిర్ణయం వస్తే పార్టీని వీడేందుకు సిద్ధంగా ఉన్నట్లు ముఖ్యనేతలకు సమాచారం ఇచ్చారు. అంతేకాకుండా కౌన్సిల్ చైర్మన్, అసెంబ్లీ స్పీకర్‌కు లిఖిత పూర్వకంగా తెలియజేసినట్లు తెలుస్తోంది. ఒకవేళ పెద్దన్నకు టికెట్ కేటాయిస్తే కోలార్‌లో ఎస్సీ ఓటర్లు రెండు వర్గాలుగా చీలిపోతారని, ఫలితంగా పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లుతుందని సీనియర్ నేతలు పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకొచ్చారు. పెద్దన్నకు టికెట్‌ను వ్యతిరేకించిన వారిలో జి. మంజునాథ్ (కోలార్ అసెంబ్లీ నియోజకవర్గం), కేవై నంజెగౌడ (మలూర్ అసెంబ్లీ), ఎంసీ సుధాకర్ (చింతామణి అసెంబ్లీ), ఎమ్మెల్సీలు అనిల్ కుమార్, నజీర్ అహ్మద్ ఉన్నారు. వీరిలో సుధాకర్ ప్రస్తుతం రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఓ వైపు వ్యతిరేక స్వరం వినిపిస్తూనే.. పార్టీ అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి ఉంటామని నేతలు ప్రకటించడం గమనార్హం. కోలార్ స్థానంలో పూర్వవైభవం సాధించాలంటే తమ కుటుంబానికి చెందిన వ్యక్తే బరిలో ఉండాలని మునియప్ప అంటున్నారు కానీ పార్టీ ఏ నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటానని చెబుతున్నారు. 'ఎన్నికల ముందు ఇలాంటి చిన్న అవరోధాలు సహజమే. కాకపోతే, దురదృష్టం కొద్దీ ఇవి తారస్థాయికి చేరాయి. మేమంతా ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌లను కలిశాం. పరిస్థితి వివరించాం. నియోజకవర్గ ప్రజల పూర్తి మద్దతకు ఉందని చెప్పా. కేవలం ఒకే ఒక్కసారి, అదికూడా గత ఎన్నికల్లోనే ఓటమి ఎదురైందన్న సంగతి వాళ్లకు కూడా తెలుసు. అసమ్మతి నేతలు కూడా కొన్ని పేర్లు ప్రస్తావించారు. అందరం కలిసి నిర్ణయాన్ని పార్టీ హైకమాండ్‌కే విడిచిపెట్టాం. ఆ నిర్ణయానికి అనుగుణంగా నడుచుకుంటాం' అని మునియప్ప మీడియాకు వివరించారు. అయితే, అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి. కాగా కోలార్ నియోజకర్గం నుంచి బీజేపీ బరిలోకి దిగుతుందా? మిత్రపక్షం జేడీఎస్‌కు కేటాయిస్తుంద అన్న విషయంలో స్పష్టత లేదు. గత సార్వత్రిక ఎన్నికల్లో కర్నాటకలోని మొత్తం 28 స్థానాలకు గానూ 27 స్థానాల్లో బరిలోకి దిగిన బీజేపీ 25 చోట్ల విజయం సాధించింది. అందులో కోలార్ కూడా ఒకటి. భాజపా మద్దతుతో మాండ్య నుంచి సుమలత గెలుపొందారు. దీంతో కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్న ఈ స్థానాన్ని మళ్లీ చేజిక్కించుకునేందుకు ఎన్డీయే కూటమి తీవ్రంగా కసరత్తు చేస్తోంది.

మణిపూర్‌లో ఈస్టర్‌కు సెలవు లేదు

ఇంఫాల్:
గుడ్‌ఫ్రైడే, ఈస్టర్ పండుగ సందర్భంగా శనివారం, ఆదివారం సెలవులు రద్దు చేస్తూ మణిపూర్‌లోని బీజేపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఆదివారాన్ని సైతం పనిదినంగా ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది. ఈ మేరకు ఆదేశాలను గవర్నర్ అనసూయ ఉయికే సహాయ కార్యదర్శి విడుదల చేశారు. ప్రభుత్వరంగ సంస్థలు, కార్పొరేషన్‌లు, స్వయంప్రతిపత్తి కలిగిన సంస్థలు, సొసైటీలతో సహా అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు ఈ ఆదేశాలు వర్తిస్తాయి. రాష్ట్రంలో మొత్తం తొమ్మిదికిగాను ఐదు జిల్లాలలో క్రైస్తవులు ఎక్కువ. 2011 జనగణన ప్రకారం 41.29 శాతం క్రైస్తవ జనాభా ఉంది. వీరంతా కుకీలు.

పంజాబ్‌లో 'ఆపరేషన్ కమలం'

- మా ఎమ్మెల్యేలకు బీజేపీ గాలం
- ఆప్ నేతలు సౌరభ్ భరద్వాజ్, సందీప్ పాథక్

చండీగఢ్:
పంజాబ్‌లో ఆపరేషన్ కమలం ప్రారంభమైందని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నేతలు సౌరభ్ భరద్వాజ్, సందీప్ పాథక్ ఆరోపించారు. 'మీకు ఏం కావాలో చెప్పండి ఇస్తాం. మా పార్టీలో చేరకపోతే మిమ్మల్ని వదిలిపెట్టం' అంటూ ఆప్ ఎమ్మెల్యేలకు బీజేపీ నుంచి ఫోన్లు వస్తున్నట్లు తెలిపారు. డబ్బు ఇస్తాం, వై కేటగిరి భద్రత కల్పిస్తాం, లోక్‌సభ ఎన్నికల్లో టికెట్లు ఇస్తామంటూ ఆప్ పంజాబ్ ఎమ్మెల్యేలను బీజేపీ ప్రలోభ పెడుతోందని ఆరోపించారు. ఇటువంటి చర్యలు కేవలం పార్టీకే కాదు యావత్ దేశానికి ప్రమాదకరమని వ్యాఖ్యానించారు. పూర్వం దేశాన్ని ముక్కలు చేసేందుకు విఫల ప్రయత్నాలు ఎన్నో జరిగాయని చరిత్ర చెబుతోందని... బీజేపీ ప్రయత్నాలు కూడా ఫలించబోవని అన్నారు. తమ పార్టీ లోక్‌సభ ఎంపీ సుశీల్ కుమార్ రింకు బీజేపీలో చేరడాన్ని భరద్వాజ్ ఆక్షేపించారు. లోక్‌సభలో బీజేపీని తీవ్రంగా విమర్శించే నాయకుడు ఇప్పుడు ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నాడంటే అర్థమేమిటని ప్రశ్నించారు. నిషేధిత ఉగ్ర సంస్థ 'సిక్స్ ఫర్ జస్టిస్' అధినేత గుర్‌పత్వంత్ సింగ్ పన్ను వ్యాఖ్యలను బీజేపీ పరిగణనలోకి తీసుకోవడం సిగ్గుచేటన్నారు. బీజేపీ దేశద్రోహి అని విమర్శించారు. ఆప్ అధినేత కేజ్రీవాల్ అరెస్టు విషయంలో ప్రజాస్వామ్యంపై ఆందోళన వ్యక్తం చేస్తూ అమెరికా, జర్మనీ దేశాలు స్పందించడంతో కేంద్రప్రభుత్వ వెన్నులో వణుకు మొదలైందన్నారు. కేంద్రం ఇప్పటికే ఆ రెండు దేశాల దౌత్యాధికారులకు సమన్లు జారీచేసిన విషయం విదితమే. ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేలను తమ గూటికి చేర్చుకొని, ఎన్నికైన ప్రభుత్వాలను కూల్చివేయడమే ఆపరేషన్ కమలం. ఇదిప్పుడు పంజాబ్‌లో కొనసాగుతోందని భరద్వాజ్ వ్యాఖ్యానించారు. 2022లో జరిగిన పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నాల్గో స్థానంలో నిలిచిందని, ఆప్, కాంగ్రెస్, శిరోమణి అకాలీ దళ్ మొదటి మూడు స్థానాల్లో ఉంటే రింకు... బీజేపీలోకే ఎందుకు వెళ్లారన్న సందేహాన్ని వ్యక్తంచేశారు. లోక్‌సభ ఎంపీగా ఆయన పదవీ కాలం ముగిసిందన్నారు.

నిశితంగా గమనిస్తున్నాం...

- కేజ్రీవాల్ అరెస్టుపై అమెరికా వ్యాఖ్యలు
- కాంగ్రెస్ బ్యాంకు ఖాతాల గురించీ ప్రస్తావన
- సమన్లతో బదులిచ్చిన భారత్

న్యూఢిల్లీ:
మద్యం కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు, కాంగ్రెస్ పార్టీ బ్యాంకు ఖతాల స్వాధీనం నేపథ్య పరిణామాలను తమ దేశం నిశితంగా గమనిస్తున్నట్లు అమెరికా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మాథ్యూ మిల్లర్ తెలిపారు. విపక్ష నేతలపై కేసుల విచారణ పారదర్శకంగా జరగాలని ఆకాంక్షించారు. మిల్లర్ గురువారం భారత అధికారులతో సుమారు 40 నిమిషాలు సమావేశమయ్యారు. కేజ్రీవాల్ వ్యవహారంతో పాటు కాంగ్రెస్ పార్టీ బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేయించడాన్ని ప్రశ్నించారు.

'రాబోయే ఎన్నికల్లో తమ ప్రచారాన్ని తీవ్రంగా ప్రభావితం చేసే విధంగా ఐటీ అధికారులు తమ బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేశారని కాంగ్రెస్ పార్టీ ఆరోపణలు చేయడం గురించి మాకు తెలుసు' అని అన్నారు. వ్యక్తిగత, దౌత్య సంభాషణల గురించి మాట్లాడటం లేదని బహిరంగంగా చేసిన వ్యాఖ్యలనే మరలా చేశానని, దీనిపై ఎవరికీ అభ్యంతరం ఉండరాదన్నారు. కేజ్రీవాల్ విషయంలో అమెరికా వ్యాఖ్యలను భారత విదేశాంగ శాఖ తీవ్రంగా ఖండించింది. దేశ అంతర్గత విషయాల్లో ఇతరుల జోక్యం అక్కర్లేదని తేల్చిచెప్పింది. అమెరికా వ్యాఖ్యలు అసమంజసమైనవని పేర్కొంది. ఆ దేశ దౌత్యవేత్తకు భారత్ సమన్లు పంపింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.